


వర్షానికి కంకర గుంట బ్రిడ్జి వద్ద ట్రాఫిక్


మూడొంతెనల వద్ద డ్రైనేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా


రింగ్‌రోడ్డులో వర్షపు నీరు


వేణుగోపాల్‌నగర్‌లోని ఎస్‌కేబీపీ హైస్కూల్ ప్రాంగణంలో..


తెనాలి : వర్షపు గాలులకు పడిపోయిన వరి పైరు

రైతుల ఆశలపై.. కుండపోత

- అల్పపీడన ద్రోణితో ఎడతెరిపిలేని వర్షం
- స్తంభించిన జనజీవనం..రోడ్లన్నీ జలమయం
- వరి, పత్తి పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం
- హార్బర్‌లో రెండో రోజూ కొనసాగిన ప్రమాద సూచిక

అల్పపీడన ద్రోణి ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతు న్నాయి. వర్షాలు పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన వరి పంటపై వానలు విరుచుకుపడడం దిగుబడులపై ప్రభావం చూపుతుం దని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరితో పాటు మొక్కజొన్న, పత్తి పంటలకు వానలు ప్రతికూలంగా మారనున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై.. రోడ్లు కాల్వలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా డెల్టా ప్రాంతమైన లంక గ్రామాల్లో వర్ష ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కలెక్టర్లు అధికా రులతో సమీక్షలు నిర్వహించి ముందస్తు రక్షణ చర్యల పై చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయానికి కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి.. హెల్ప్‌లైన్ నం బర్లను అందు బాటులో ఉంచారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులు తుపాను హెచ్చరికల నేపథ్యం లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.

తెనాలి, గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గురువారం కుండపోతగా వర్షాలు కురిశాయి. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు విరామం ఇవ్వకుండా పడుతున్న వర్షంతో.. జనజీవనం స్తంభించిపోయింది. తెల్లవారుజాము నుంచి వర్షం వదలకుండా రాత్రి వరకు పడుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వాన కురిసింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరి సాగు చేపట్టిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వర్షానికి లోతట్టు ప్రాంతాలే కాకుండా, మెరక ప్రాంతాలకూ ముంపు తప్పలేదు. పల్నాడు జిల్లా పరిధిలో కూడా గురువారం ఓ మోస్తరు నుంచి భారీగానే వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు పొంగి ప్రవహించాయి. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. పదిహేను రోజుల్లో కోతకు రానున్న తరుణంలో ఈదురు గాలులతో కూడిన వర్షంతో వరి నేలవాలింది. నోటి దాకా వచ్చిన పంట నీటిపాలవుతుందనే వేదన రైతుల్లో నెలకొంది. జూన్, జూలైలో మేఘాలు ముఖం చాటేసిన తరుణంలో విపరీతమైన ఎండలు కాశాయి.. దీంతో ఏ పైరును సాగు చేయలేకపోయారు. ఇప్పుడు వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరి, పత్తి చేలల్లో వర్షపు నీరు చేరింది. లేత పత్తిలో (మిగతా 6వ పేజీలో)


ఏటి అగ్రహారం 16వ లైనులో వర్షపు నీరు

కంట్రోల్ రూంల ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండలాల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. ప్రజలు ఎలాంటి సాయం కోసమైనా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం(08632234014)కు ఫోన్ చేయవచ్చన్నారు. ఉరుములు, పిడుగుపాటు సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. గండి పడే అవకాశం ఉన్న వాగులు, వంకలు, చెరువులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరం మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్ష ప్రభావ ప్రాంతాల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం పర్యటించారు. మూడు వంతెనలు, బ్రాడీపేట నాలుగో లైన్ మీదగా.. కంకర గుంట ఆర్‌యూబీని పరిశీలించారు. జన జీవనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు.

రేపల్లె: నిజాంపట్నం హార్బర్‌లో రెండో రోజు గురువారం మూడో నంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణమే ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో.. వేట చేసే పరిస్థితి లేక మత్స్యకారులు తిరుగుప్రయాణమై హార్బర్‌కు చేరారు. ఈదురు గాలులతో కూడిన భారీవర్షం పడుతుండటంతో అలల ఉధృతి ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.



రాజధానిలో గ్రామాల అభివృద్ధికి చర్యలు

- గ్రామదర్శినిలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

మంగళగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఏపీసీఆర్డీఏ కమిషనర్ కే.కన్నబాబు తెలిపారు. అమరావతికి భూములిచ్చిన రైతులతో గురువారం మంగళగిరి మండలం కురగల్లు గ్రామంలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో


గ్రామదర్శినిలో సమస్యలు వింటున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

గ్రామదర్శిని నిర్వహించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా సీఆర్డీఏ కమిషనర్ మాట్లాడుతూ రైతులు, గ్రామస్థులు చెప్పిన సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో రూ.904 కోట్లతో మౌలిక వసతులను అభివృద్ధి చేసేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రిటర్నబుల్ ప్లాట్లలో వీలైనంత త్వరగా అభివృద్ధి పనులను పూర్తి చేసి రైతులకు అందజేస్తామని తెలిపారు. సీఆర్డీఏ సామాజిక సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో స్థానిక యువతకు ఉపాధి కల్పించే నిమిత్తం జాబ్‌మేళాలు, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవతేజ, క్యాపిటల్ సిటీ ల్యాండ్స్ డైరెక్టర్ వసంతరాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శేషిరెడ్డి, సామాజిక సంక్షేమ విభాగం డైరెక్టర్ వి.రాములు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(ఎల్‌పి) ఎస్.రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.


రూ.7.89 కోట్లతో అగ్నిమాపక కేంద్రాలు

- గుంటూరు, తెనాలి, నేలపాడులో ఫైర్‌స్టేషన్ల నిర్మాణం
- పొన్నూరు, వెలగపూడి కేంద్రాలకు నిధులు మంజూరు

గుంటూరు సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ప్రాంతాల్లో అగ్ని మాపక కేంద్రాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7.89 కోట్లు మంజూరు చేసింది. గుంటూరు, తెనాలి, నేలపాడులో ఫైర్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. కలెక్టరేట్‌లో నిర్మించే అగ్నిమాపక కేంద్రానికి రూ.3.39 కోట్లు, తెనాలిలో కేంద్రానికి రూ.2.25 కోట్లు, నేలపాడులో అగ్ని మాపక కేంద్రం నిర్మాణానికి రూ.2.25 కోట్లు మంజూరయ్యాయి. ఇవిగాక నిర్మాణం అసంపూర్తిగా ఉన్న పొన్నూరు అగ్ని మాపక కేంద్రానికి రూ.47 లక్షలు, వెలగపూడిలోని అగ్ని మాపక కేంద్రం మరమ్మతులకు రూ.20 లక్షలు సీఆర్‌డీఏ నుంచి నిధులు మంజూరయ్యాయి.


కలెక్టరేట్‌లో నూతన అగ్ని మాపక కేంద్రం నిర్మించే ప్రదేశం

జడ్పీలో.. జాప్యం



అద్దె బకాయిల వసూళ్లపై అధికారుల నిర్లక్ష్యం ● రూ.25 కోట్లున్నా వర్క్ ఆర్డర్ల కోసం పడిగాపులు

- ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా అలక్ష్యం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణ నుంచి నిధులు వినియోగం వరకు అన్ని అంశాల్లో జాప్యం జరుగుతోంది. జడ్పీలో అత్యవసరంగా ఏ ఫైల్ కదలాలన్నా నెలలు పడుతోంది. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోవడంలేదు. ఇక్కడ ప్రతీ పని ఆలస్యమే అన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ మధ్య కాలంలో జరిగిన సంఘటనలపై పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన ఉండటంలేదు. ఈ నెల 29న సర్వ సభ్య సమావేశంలో ఆయా అంశాలపై చర్చ జరగనున్నట్లు తెలుస్తుంది. జడ్పీకి రూ.వేల కోట్లు విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. అవి ఎక్కడికక్కడ అన్యాక్రాంతం అవుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు సర్వే నెంబరు 251లో జడ్పీకి 2.71 ఎకరాల భూమి ఉంది. దానిని నామ్ ఎక్స్‌ప్రెస్ వే (టోల్‌గేట్) సంస్థ వాడుకుంటుంది. అందుకు 2013 నుంచి అద్దె చెల్లిస్తుంది. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అద్దె చెల్లింపులు ఆపేసింది. ఇప్పటికీ జడ్పీకి ఆ సంస్థ నుంచి రూ.12.64 లక్షలు అద్దె రావాల్సి ఉంది. వాటిని చెల్లించక పోగా భూమిని జిల్లా పరిషత్ ప్రమేయం లేకుండా సంస్థకు కేటాయిస్తూ జగన్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దానిపై ఇటీవల గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై జడ్పీ అధికారులు కనీస దృష్టి సారించినట్లు కూడా కనిపించడంలేదు. ఇదే రీతిలో జడ్పీకి చెందిన భూముల ఆక్రమణలపై జారీ చేసిన నోటీసులు, కేసులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. ఆస్తుల పరిరక్షణకు జడ్పీ ఛైర్‌పర్సన్ కమిటీలు ఏర్పాటు చేసినా సదరు సమావేశాలు నిర్వహించడంలో యంత్రాంగం విఫలమవుతోందన్న విమర్శలున్నాయి.

నిధులు ఉన్నా.. పనులు సున్నా

ప్రభుత్వం జడ్పీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 కోట్లు కేటాయించింది. అయినా పనులు కేటాయించడం లేదని పలువురు జడ్పీ టీసీలు వాపోతున్నారు. పాలక వర్గం ఆమోదం పొందిన తర్వాత వర్క్ ఆర్డర్లు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పనులకు సంబంధించిన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయంటున్నారు. పాలక వర్గం గడువు ముగుస్తున్నా పనులు కేటాయించడంలో అధికారులు ఈ రకంగా ప్రవర్తిస్తే ఎలా అన్నది కొందరు జడ్పీటీసీల వాదన. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాలకవర్గం, కొందరు ప్రజాప్రతినిధులకు మధ్య అగాథం ఏర్పడినట్లు తెలుస్తుంది. కేటాయించిన పనులకు సంబంధించి ప్రగతికి సంబంధించి నివేదికలు తెప్పించుకుని చేపట్టాల్సిన సమీక్షలపైనా నిర్లక్ష్యం కనిపిస్తోంది.

నార్ల ఆడిటోరియానికి మోక్షం

- పీపీపీ విధానంలో అభివృద్ధికి అనుమతి
- నగరంలో స్మార్ట్ స్ట్రీట్ బజార్లు, నైట్ షెల్టర్ జోన్లు
- కౌన్సిల్ సమావేశంలో ఎనిమిది అంశాలకు ఆమోదం
- సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యేలు మాధవి, నజీర్, బూర్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు మాధవి, నసిర్, బూర్ల



గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని నార్ల ఆడిటోరియానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పీపీపీ విధానంలో ఆడిటోరియం అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదించగా గుంటూరు నగర పాలక సంస్థ ఆమోదించింది. ఈ మేరకు గురువారం మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆడిటోరియం అభివృద్ధికి ప్రభుత్వ ప్రతిపాదనలపై కౌన్సిల్‌లో చర్చించిన సభ్యులు ఆమోదించారు. మొత్తం ఎనిమిది అంశాలకు సభ్యులు ఆమోదముద్ర వేశారు. నార్ల ఆడిటోరియం, స్మార్ట్ స్ట్రీట్ బజార్లకు సంబంధించిన అంశాలపై డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబుతో పాటు వైసీపీ కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. ఆటోనగర్ వై జంక్షన్ నుంచి మణిపురం బ్రిడ్జి లోపు స్మార్ట్ స్ట్రీట్ బజార్లను ఏర్పాటు చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. పట్టాభిపురంలో నైట్‌షెల్టర్ జోన్ ఏర్పాటుకు రూ.2 కోట్లు కేటాయించారు. గార్డెన్స్ నుంచి గుజ్జనగుండ్ల వాటర్ ట్యాంకుల వరకు రోడ్డు అభివృద్ధితో పాటు డ్రెయిన్ల ఏర్పాటుకు రూ.2.61 కోట్లు మంజూరు చేశారు. గోరంట్ల కొండపై వాటర్ స్కీమ్‌కు రూ.80 లక్షలు కేటాయించారు. పూలు, పండ్ల మొక్కల కొనుగోలుకు రూ.50 లక్షలు కేటాయించారు.

నిధుల ఖర్చులో పారదర్శకత లేదు

నగర అభివృద్ధి పనుల ఖర్చుల విషయంలో పారదర్శకత లేకపోవడంపై పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో ఎక్కడ ఎంత ఖర్చు జరుగుతుందో ఎవరికీ తెలియదన్నారు. రూ.100 కోట్ల పనులు జరిగితే రూ.2 కోట్ల బిల్లులను మంజూరు చేశారన్నారు. కార్పొరేషన్ చేసే ప్రతీ రూపాయి ఖర్చుకి లెక్క ఉండాలన్నారు. నగర శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు.

రాజధానిలో.. కేంద్ర బ్యాంకులు

- ఉద్దండరాయునిపాలెంలో 28న భూమిపూజ
- ఒకే రోజు 12 బ్యాంకులకు శంకుస్థాపన
- కార్యక్రమానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్?



గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో త్వరలో 12 జాతీయ బ్యాంకులకు సంబంధించిన రాష్ట్ర ప్రధాన కార్యాలయాల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ నెల 28న బ్యాంకుల శంకుస్థాపన జరగనున్నది. అమరావతిలో బ్యాంకుల రాష్ట్ర కార్యాలయాలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భూములు కేటాయించింది. ఉద్దండరాయునిపాలెం సమీపంలోని ఎన్ 10 రోడ్డు వద్ద, సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుకుని బ్యాంకులకు ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. కేటాయించిన స్థలాల చుట్టూ ఆయా బ్యాంకుల అధికారులు రేకులతో కాంపౌండ్ వాల్స్ నిర్మించి, నేమ్ బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బ్యాంకు కార్యాలయాల నిర్మాణాలకు సంబంధించి భూమి పూజ చేయించాలని బ్యాంకు అధికారులు భావిస్తున్నారు. ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని చెబుతున్నారు. కాగా రాష్ట్ర విభజన అనంతరం బ్యాంకులకు రాష్ట్ర కార్యాలయాలు లేకుండా పోయాయి. అవన్నీ విజయవాడలోని ప్రాంతీయ కార్యాలయాల్లోనే తమ రాష్ట్ర కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రాజధానిలో కార్యాలయాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్ర ప్రధాన కార్యాలయాలను అమరావతికి తరలించాలని బ్యాంకు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

బ్యాంకులు	కేటాయింపు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	3 ఎకరాలు
ఆప్కాబ్	2 ఎకరాలు
కెనరా బ్యాంకు	25 సెంట్లు
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	25 సెంట్లు
ఇండియన్ బ్యాంక్	25 సెంట్లు
బ్యాంక్ ఆఫ్ బరోడా	25 సెంట్లు

పరోక్ష అభిషేకాలకు 1,100 మంది భక్తుల నగదు చెల్లింపు

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజలు జరుగుతున్నాయి. ప్రత్యక్షంగా స్వామివారికి అభిషేకాలు చేయించుకోలేని భక్తులు దేవస్థానం అమలు చేస్తున్న పరోక్ష అభిషేక పథకంపై ఆసక్తి చూపారు. ఇప్పటి వరకు 1,100మంది రూ.1,116 లెక్కన చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరి పేరు మీద ప్రతి రోజు ఉదయం స్వామివారికి అభిషేకం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ రేఖ తెలిపారు. కార్తీక పౌర్ణమి వరకు ఈ పథకం కొనసాగుతుందన్నారు.

డైట్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బోయపాలెంలోని డైట్ కళాశాలలో అధ్యాపకుల పోస్టులు డిప్యూటేషన్‌పై భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో సైకాలజీ, సోషియాలజీ, తెలుగు, ఫైన్‌ఆర్ట్స్, సీనియర్ ఆంగ్ల, గణిత అధ్యాపకుల పోస్టులకు ఈనెల 29లోగా దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం **www.dietboyapalem.com** వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

24, 26 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల వారాంత రద్దీ దృష్ట్యా ఈ నెల 24, 26 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07642 మచిలీపట్నం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 24న ఉదయం 6.50కి బయలుదేరి 9.35కి గుంటూరు, 10.18కి సత్తెనపల్లి, 11.02కి నడికుడి, సాయంత్రం 4.15కి చర్లపల్లి చేరుకొంటుంది. 07641 చర్లపల్లి - మచిలీపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 26న రాత్రి 7.50కి బయలుదేరి 10.34కి నడికుడి, 11.25కి సత్తెనపల్లి, రాత్రి 1.30కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 6 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల


దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న తాత్కాలిక రెక్టార్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దూర విద్యాకేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన బీ.ఎ., బీకాం(జనరల్ కంప్యూటర్ అప్లికేషన్స్), బీ.బీ.ఎ, ఎంఎ, బీ.ఎల్‌ఐసీ, ఎంఎ ఎకనామిక్స్ బీఎల్‌ఎస్ కోర్సుల పరీక్షలకు సంబంధించి ఫలితాలను తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, దూరవిద్య సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని దూరవిద్య పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైనులాబ్దిన్ తెలిపారు. ఒక్కొక్క పేపరు రీ-వాల్యుయేషన్‌కు డిగ్రీ విద్యార్థులు రూ.770, పీజీ, బీఎల్‌ఐసీ విద్యార్థులు రూ.960 చెల్లించాలన్నారు. రీవాల్యుయేషన్ దరఖాస్తులను వచ్చే నెల 7లోపు విశ్వవిద్యాలయంలోని దూరవిద్య పరీక్షల సమన్వయకర్తకు అందజేయాలన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల నిలిపివేత


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 35,261 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వా యర్‌లో 10.8 అడుగుల నీటిమట్టం కొనసాగు తుండగా దిగువకు 34,750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 511 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టాకు, గుంటూరు చానల్ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టంగురువారం నాటికి 587.20 అడుగులు ఉంది. ఇది 305.62 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 7,033, ఎడమ కాలువ ద్వారా 6,556, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,089, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 48,778 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 48,778 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

లక్ష్యానికి చేరువలో జలవిద్యుత్ ఉత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల నుంచి బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0737 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 3 గేట్లను మీటర్ మేర ఎత్తి 12,702, టేల్ రేస్ చానల్ ద్వారా 8,742.. మొత్తంగా 21,404 క్యూసెక్కుల నీరు పులిచింతలకు విడుదల చేస్తున్నారు.ఎగువన సాగర్,ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33,089 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా.. ఇది 7.080 టీఎంసీలకు సమానం. 2026 మార్చి 31 వరకు 80 ఎంయూల విద్యుదుత్పత్తి లక్ష్యం కాగా ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 55.006 ఎంయూల కరెంట్‌ను తయారు చేశారు.

గంజాయి విక్రేతల అరెస్టు


నిందితులను అరెస్టు చూపిస్తున్న అర్బన్ పోలీసులు

పొన్నూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న యువకులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ఎల్.వీరానాయక్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని వీబీఎన్ కళాశాల డొంక రోడ్డులో గంజాయి సేవించడంతో పాటు విక్రయిస్తున్నారని సమాచారంతో అర్బన్ సీఐ వి.శ్రీహరి, ప్రొబేషనరీ ఎస్‌ఐ ఎం.నాగార్జున పోలీస్ సిబ్బందితో కలిసి సోదాలో నిర్వహించినట్లు చెప్పారు. పదిమంది యువకులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా.. 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా మర్రి సాయి మణికంఠరెడ్డి అనే నిందితుడు బాపట్ల జిల్లా వెదులపల్లి గ్రామానికి చెందిన ప్రసన్నకుమారి అనే మహిళ గంజాయి విక్రయించినట్లు తెలిపారు. పరిచయస్తులైన కత్తి యశ్వంత్, పోలవరపు అజయ్, ఏకశిరి సూర్యనారాయణ, కంబాల శ్రీనాథ్ రెడ్డికి చిన్న ప్యాకెట్లుగా విక్రయించినట్లు తెలిపారు. గంజాయి పొందిన సదరు యువకులు.. షేక్ షబీర్, అలూరి వెంకట మణిరత్నం, మోపర్తి దేవదాసు, ప్రసాదం తరుణ్ కుమార్, విన్నకోట భరత్ కల్యాణ్ అనే వారికి ప్యాకెట్ రూ. 500లకు విక్రయించినట్లు విచారణలో తేలిం దన్నారు. పోలవరపు అజయ్, వెదుళ్ళపల్లి ప్రసన్నకుమారి ఇద్దరు గంజాయి విక్రయితలు పరారీలో ఉండగా, బంట్రోతు ప్రశాంత్ అనే గంజాయి సేవిస్తున్న యువకుడు కూడా పరారీలో ఉన్నటట్లు పోలీసులు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి విక్రయాలు సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వలస కూలీల పిల్లలకు సీజనల్ హాస్టల్స్


కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న జేసీ శ్రీవాస్తవ

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు సమీపంలో బిహార్, ఒడిశా, ఉత్త ప్రదేశ్, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాల పిల్లలకు సీజనల్ హాస్టల్స్‌ని నిర్వహించ బోతున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గురువారం ఆయన ఈ అంశంపై ఎన్‌జీవోలతో కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వలస కూలీల పిల్లల విద్యాభివృద్ధికి సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఇచ్చి న సూచనలు అనుసరించి హాస్టల్స్ నిర్వహణ కోసం ఎన్‌జీవోలను ఎంపిక చేస్తామన్నారు. ఎన్‌జీవోలు హాస్టల్స్ పిల్లల కోసం సెంటర్స్ బాధ్యతగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజూ వారికి విద్యను అందించాలని, అలాగే వాళ్ల ఆహార అలవాట్లు ప్రకారం భోజనం సదుపాయాలు కల్పించాలన్నారు. పిల్లలకు సంబంధించిన భాషలోనే విద్య అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్క ఎన్జీవో వారు కేటా యించిన పరిధిలో పూర్తి పారదర్శకంగా సెంటర్ నిర్వహించాలని ఆదేశించారు. సక్రమంగా నిర్వహించని హాస్టల్స్ ఎన్‌జీవోలపై చర్యలు తీసుకొంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పద్మ పాల్గొన్నారు.

గణేష్ హత్య కేసు నుంచి ఆ ముగ్గురిని తప్పించారు

● మృతుడి తల్లి, కుటుంబ సభ్యుల ఆరోపణ


గణేష్ తల్లి అంజలి, అక్క పూజిత, భార్య వీరాంజనేయదేవి

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పొన్నూరు రోడ్డులో ఈ నెల 7న హత్యకు గురైన కుర్ర నాగ గణేష్(25) హత్యలో ప్రమేయం ఉన్న ముగ్గురు వ్యక్తులను తొలగించారని, అందుకు రూ.8లక్షల వరకు పోలీసులకు నజరానా అందిందని మృతుడు తల్లి శివ నాగ అంజలి, భార్య వీరాంజనేయదేవి, అక్క పూజిత ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా వీరి ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తన బిడ్డ హత్యకు గురి కావడంలో కీలక పాత్ర పోషించిన గుంటూరు పొన్నూరు రోడ్డులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో పనిచేసే ఉద్యోగి గుమ్మ వేణు, మంగళగిరిలో కత్తులు అందజేసిన మరొక వ్యక్తిని, బుడంపాడులో తన బిడ్డ బయలుదేరాడని సమాచారం ఇచ్చిన మరో మహిళను కేసు నుంచి తప్పించారని మృతుడు తల్లి ఆరోపించారు. ఇదే క్రమంలో గుమ్మ వేణు స్థానంలో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులను ఇరికించారని విమర్శించారు. దీనిపై గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌ను వివరణ కోరగా ఆరోపణలు అవాస్తవమన్నారు. మరో రెండు రోజుల్లో ప్రధాన నిందితుడిని అదుపులో తీసుకుంటామని, అప్పుడు విచారణలో ఆరోపణలు నిజమని తేలితే కచ్చితంగా మిగిలిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

రైతుల ఆశలపై.. కుండపోత

(5వ పేజీ తరువాయి)

వర్షపు నీరు నిలబడడంతో పొలాలు ఉరకెత్తే ప్రమాదం ఉందని, దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాలిపోయిన పైరును నిలబెట్టడానికి రైతులు శ్రమిస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడుతూనే ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని వారు ఆందోళన చెందుతున్నారు.

- పల్నాడు జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురి శాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. రహదారులపై నీరు ప్రవహిస్తోంది. పొలాల్లో నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతుం డడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలు పత్తి, మిరప పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. రెడ్డిపాలెం, మాచవరం, పరగటిచర్ల, అన్నవరం, ముత్తనపల్లి తదితర గ్రామాల్లో ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. మాచవరంలో చప్టాపై నుంచి వర్షపు నీరు ప్రవహించటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి, అన్నవరం గ్రామాల్లో వర్షపు నీరు చప్టాలను తాకుతూ ప్రవహిస్తుంది. భారీ వర్షాల నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని ఎక్కడికక్కడ ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తరిగి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. క్రోసూరు మండలం ఆవులవా రిపాలెంలో వైద్యాధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు.

4 గంటల్లో.. 27 మిల్లీమీటర్ల వర్షం

వాయుగుండం ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షం కురిసింది. అన్ని మండలాల్లోనూ గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్యన కుంభవృష్టి పడింది. ఉదయం 8.30 గంటల ముందు వరకు 21.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టడంతో సాయంత్రం కేవలం 3.4 మిల్లీమీటర్లకు తగ్గింది. దుగ్గిరాల, చేబ్రోలు, కొల్లిపర, గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి మండలాల్లో అంతకంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం నుంచే ఆకాశం దట్టమైన కారుమబ్బులు కమ్ముకొని చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం ఉదయం 8.30 తర్వాత ఒక్కసారిగా భారీగా వర్షించింది. మధ్యాహ్నం వరకు కురుస్తూనే ఉన్నది. ఈ కారణంగా కాకుమానులో 14.6, మేడికొండూరులో 28.2, తుళ్లూరులో 14.2, తాడేపల్లిలో 16.2, తాడికొండలో 18, మంగళగిరిలో 16.4, పెదకాకానిలో 25.6, చేబ్రోలులో 46.4, దుగ్గిరాలలో 69.4, కొల్లిపరలో 41.6, గుంటూరు పశ్చిమలో 40, గుంటూరు తూర్పులో 42.4, పొన్నూరులో 21.4, ఫిరంగిపురంలో 25.6, వట్టిచెరుకూరులో 18.2, ప్రత్తిపాడులో 10.2, తెనాలిలో 38.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బాలికను గర్భవతిని చేసిన యువకుడు

● పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

తాడికొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన యువకుడిపై పోలీసులు బుధవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేశారు. తాడికొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తండ్రి మరణించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూసుకుంటూ.. ఆ బాలిక ఇంటి వద్దే ఉంటోంది. మండలానికి కేంద్రానికి చెందిన ఓ యువకుడితో బాలికకు పరిచయం ఏర్పడింది. అతడు ప్రేమ పేరుతో బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశారు. బాలిక ఐదు నెలల గర్భిణి అని తెలుసుకున్న బంధువులు ఆ యువకుడిని పెళ్లి చేసుకోవాలని కోరారు. అతను పెళ్లికి నిరాకరించడంతో తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం బయటకు రావడంతో యువకుడు పరారయ్యాడు. తుళ్లూరు డీఎస్పీ మురళికృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్

● గుంటూరు సర్కిల్ ఎస్‌ఈ రమేష్

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో గుంటూరు విద్యుత్ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ చల్లా రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎక్కడైనా 33కేవీ, 11కేవీ, ఎల్‌టీ లైన్‌లు తెగిపడిపోతే.. కంట్రోల్ రూమ్ నంబరు 94408 17526 లేదా టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. తడిచిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు లేదా శబ్దం వచ్చినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు.

బకాయిలు చెల్లించే వరకూ ఆందోళన

● చలో విజయవాడలో ఆశ నేతల డిమాండ్

విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన రూ.2600 కోట్ల బకాయిలను చెల్లించే వరకు ఆందోళనలు కొనసాగిస్తా మని ఆశ (ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్) నేతలు పేర్కొన్నారు. గురువారం చలో విజయవాడలో భాగంగా స్థానిక ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుతో తమ ఆసుపత్రులను మూసివేసే పరిస్థితికి వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు ఆత్మహత్యలకు పాల్పడకముందే ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు వైద్య సేవలందించి వారి ప్రాణాలు కాపాడే తమ కష్టాలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2007లో ఉన్న ధరలనే ఇప్పటికీ ఇస్తున్నారని వాటిని కూడా పూర్తిగా చెల్లించకుండా వేల కోట్లు పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆసుపత్రులను నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. రూ.250 కోట్లు చెల్లిస్తామన్న ప్రభుత్వ ప్రకటనకు తాము అంగీకరించలేదని.. రూ.650 కోట్లు వెంటనే విడుదల చేసి.. మిగిలిన రూ.రెండు వేల కోట్లు విడతల వారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం చంద్రబాబుపైనే మాకు నమ్మకం

● సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల విజ్ఞప్తి

విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు 15 రోజుల పాటు రేషన్ సరుకులు అందుబాటులో ఉంచుతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు రేషన్ డీలర్లకు కూడా న్యాయం చేస్తారనే నమ్మకాన్ని రేషన్ డీలర్లు వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లకు ఎప్పుడు కమీషన్ పెంచినా అది చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే జరిగిందని గుర్తు చేశారు. డోర్ డెలివరీ పేరుతో నిత్యావసరాలు ఒక పూటకు పరిమితం చేయడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పాదయాత్రలో చూసిన ఆయన డోర్ డెలివరీ తొలగించి.. అటు ప్రజలకు న్యాయం చేయడంతో పాటు ఇటు రేషన్ డీలర్ల ఉనికిని తిరిగి తీసుకొచ్చారని తెలిపారు. డీలర్లు కూడా ప్రభుత్వ ఆదేశాలను సమర్థంగా అమలు చేస్తున్నారని తెలిపారు. కాకపోతే డీలర్లలో కూడా 65 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు కూడా ఉన్నారని, ఈ విషయమై పునరాలోచించి డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

35,492 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 36,297 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,492 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,269 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10000	13500	నెంబరు. 5	10000	14500
341	10000	15700	273	---	---
4884	---	---	341	10000	16000
సూపర్ 10	---	---	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15100	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15500	దేవనూరు డీలక్స్	10500	14600
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	8000

బాలకృష్ణ కాలిగోటికి సరిపోని జగన్

● కసుకుర్తి హనుమంతరావు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కాలిగోటికి కూడా సరిపోడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు విమర్శించారు. జగన్ ప్రెస్ మీట్ చూసిన తర్వాత రాష్ట్ర ప్రజానీకం జగన్ రెడ్డి ఇంగ్లాండు నుంచి మంచి మందులతోనే తిరిగొచ్చాడని భావిస్తోందని ఎద్దేవా చేశారు. భయంతో అసెంబ్లీకి రాని జగన్ అసెంబ్లీ సమావేశాలపై వ్యాఖ్యానించడం ఆయన మూర్ఖత్వానికి పరాకాష్ట అని అన్నారు. శాసన సభాపతిపై జగన్ మాట్లాడిన తీరు చూస్తుంటే ఆయనకు మతిస్థిమితం లేదని అర్థం అవుతోందని అన్నారు. బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హనుమంతరావు హెచ్చరించారు.

డీఏ విడుదలపై హర్షం

గుంటూరు సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత అనుకూలంగా లేనప్పటికీ ఉద్యోగులకు డీఏను విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా గురువారం గుంటూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాదల అప్పారావు మాట్లాడుతూ ఉద్యోగుల మనోభావాలు దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు డీఏను ప్రకటించే విషయంలో చొరవ తీసుకున్నారని అన్నారు. ఆర్థికశాఖ రాష్ట్ర ఆర్థిక స్థితి బాగా లేదని చెప్పినా ఉద్యోగుల కోసం సీఎం నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని పేర్కొన్నారు. అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖ లో ఉన్న ఆర్థికేతర సమస్యలను పరిష్కరించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె.కోటేశ్వరమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాసరావు, కార్యదర్శి టి.రామసీత, కోశాధికారి ఎస్ ఎస్ సురేష్ కుమార్, టి. చిన బ్రాహ్మయ్య, ఎం.మల్లిక పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మిహాయింపు ఇవ్వాలి

గుంటూరు (విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పనిచేస్తున్న (ఇన్ సర్వీస్) ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ కార్యదర్శి ఎం కళాధర్ పేర్కొన్నారు. వారు టెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణులు కావాలన్న నిబంధన సరికాదని అన్నారు. గురువారం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కళాధర్ మాట్లాడుతూ, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు అనేక పర్యాయాలు శిక్షణ పొంది ఉన్నారని, అందువల్ల వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఈ మేరకు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. ఆఫ్ లైన్ శిక్షణలు, ఆన్‌లైన్ శిక్షణలతో టీచర్లు ఇప్పటికే సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు గోవిందు, రంగారావు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్లు సరిచేయాలి

● ఎంఈవోకు ఎన్‌టీఏ నాయకుల వినతి

గుంటూరు (విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని వెంటనే సర్వీసు రిజిస్టర్లు సరిచేసి క్లస్టర్ టీచర్లను నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.హైమారావు ఎంఈవోను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఎంఈవో ఖుద్దూస్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. సర్వీస్ రిజిస్టర్లు వెంటనే అప్డేట్ చేయాలని, టీడీఎస్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఈవో ఖుద్దూస్ మాట్లాడుతూ, గుంటూరు మండలం ఈస్ట్, వెస్ట్‌లుగా విభజన జరిగిన నేపథ్యంలో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల ఉపాధ్యాయులకు టీడీఎస్‌కు సంబంధించి నోటీసులు వస్తున్నాయని అన్నారు. వీలైనంత త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, అసోసియేట్ అధ్యక్షుడు పి.లలిత బాబు, గుంటూరు నగర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వి రాఘవులు, టి.శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు టి.రవి తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌ల ఇళ్లలో చోరీలు

● నిందితుడి అరెస్ట్

● బంగారం, మూడు ఫోన్‌లు స్వాధీనం

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లలో వాచ్‌మెన్‌లు నివాసం ఉండే ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడుని పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 25 శవర్ల బంగారు ఆభరణాలు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరచి సీఐ గంగా వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. అడవితక్కెళ్ళపాడులోని టిడ్కో ఇళ్లలో నివాసం ఉండే నంబూరి రాజ్ కుమార్ 25 రోజుల క్రితం చంద్రమౌళినగర్ 6వ లైన్‌లో ఉన్న విశ్వతేజ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్ రూములో చోరీకి పాల్పడ్డాడు. అలాగే 15 రోజుల క్రితం తారకరామనగర్ రెండోలైన్‌లోని లోటస్ సెల్వెస్ అపార్ట్‌మెంట్‌లోని వాచ్‌మెన్ గదిలో మూడు సెల్ ఫోన్‌లు అపహరించాడు. ఆయా కేసుల్లో వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం నిందితుడు నంబూరి రాజ్‌కుమార్‌ను చంద్రమౌళినగర్ బేకర్స్ ఫన్ వద్ద అరెస్టు చేసి అతడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుంది. నిందితుడు రాజ్‌కుమార్ తన తమ్ముడు అశోక్, స్నేహితుడు ప్రభు కుమార్‌తో కలసి గతంలోనూ పలు చోరీలకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు.

నగరంలో ముసురు



వర్షంతో టీజేపీఎస్ కళాశాల ఎదుట నిలిచిపోయిన ట్రాఫిక్

● రెండు గంటలపాటు జోరు వర్షం
● పెరిగిన చలి.. రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు
● విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించిన అధికార యంత్రాంగం
● స్తంభించిన జనజీవనం

గుంటూరు/గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో నగరంలో గురువారం కురిసిన వర్షంతో రెండు గంటల పాటు జనజీవనం స్తంభించింది. దట్టంగా మబ్బులు కమ్ముకొచ్చి భారీవర్షం కురిసింది. దీంతో నగరంలోని అన్ని డ్రైన్స్ కల్వర్టులు వర్షపు నీటితో పొంగిపొర్లాయి. కంకరకుంట ఫ్లైఓవర్‌పై టీజేపీఎస్ కాలేజ్ ఎదుట ట్రాఫిక్ జామ్ అయింది. పట్టాభిపురం వరకు ట్రాఫిక్ ఆగిపోయింది. ఏటీఅగ్రహారం, పట్టాభిపురం, బ్రాడీపేట, అరండల్ పేట నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. ప్రధానంగా అనేకచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు. పాదచారులు, వాహదారులు ఇలా ప్రజలంతా వర్షంతో ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులతో పాటు రోజువారీ కార్యకలాపాలు చేసుకునేవారు ఇబ్బందులు పడాల్సివచ్చింది. ఉదయం మొదలైన వర్షం రాత్రి వరకు అడపా దడపా కురుస్తూనే ఉంది.

● వ్యాపారాలపై తీవ్ర ప్రభావం...

వర్షం వ్యాపారాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ముసురు పట్టటంతో సాయంత్రం సమయంలోనూ ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దాంతో నగరంలో బ్రాడీపేట, అరండల్ పేట, బృందావన్‌గార్డెన్స్, లాలాపేట, మార్కెట్ సెంటర్, గుజ్జనగుండ్ల, కొరిటపాడు, బస్టాండ్ సెంటర్‌లలో వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెలబోయాయి. మరోవైపు వర్షంతో రోడ్డు పక్క తోపుడు బండ్ల చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వాయుగుండం ప్రభావంతో మరో రెండు రోజుల పాటు వాతావరణం ఇలానే ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

● విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తోన్న సందర్భంగా విద్యాసంస్థలకు జిల్లా అధికార యంత్రాంగం గురువారం సెలవు ప్రకటించింది. విద్యా సంస్థలు సెలవు అమలు చేయాలని ఉదయం పది గంటలకు ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో ఉదయమే పాఠశాలలకు హడావుడిగా వెళ్ళిన విద్యార్థులు వర్షంలోనే తిరుగుముఖం పట్టాల్సి వచ్చింది.



రైల్వేస్టేషన్ వెనుక...

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్ష ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పర్యటించారు. మూడు వంతెనలు, బ్రాడీపేట నాల్గో లైన్ మీదుగా పర్యటించి కంకరగుంట ఆర్‌యూబీని పరిశీలించారు. అనంతరం నంబూరు వద్ద గుంటూరు చానల్, గుంటూరు నల్లాను పరిశీలించారు. కంతేరు రోడ్ అండర్ బ్రిడ్జి వద్ద పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. ఎర్రవాగు, కంతేరు వాగు, కోటెళ్లవాగులను పరిశీలించారు. నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు నిత్యం చేపడుతున్న కార్యక్రమాలు, విపత్తుల సమయంలో చేపడుతున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. సరైన కాలువ వ్యవస్థ లేక అధిక వర్షాలు పడే సమయంలో గ్రామం చుట్టూ నీరు వస్తుందని నంబూరు గ్రామస్థులు కలెక్టర్‌కు తెలిపారు. కాలువలోకి నీటి ప్రవాహం వెళ్ళే మార్గంలో కొన్ని ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించి నంబూరు కాలువలోకి నీరు పారేందుకు ఒక కిలో మీటరు మేర కాలువను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి రాంబాబు, పర్యవేక్షక ఇంజనీర్ సుందరరామి రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బ్రాడీపేటలోని పాఠశాలలో..



కలెక్టర్ కార్యాలయం ఎదుట...



గుంటూరు చానల్‌లో వరదనీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ ఫార్ములా తయారీ: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా తయారు చేశారని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆరోపించారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో లిక్కర్ మాఫియా నడిచి రూ.3,500 కోట్లు దోచుకున్నారని, ఆ అవినీతి బండారాన్ని కప్పిపెట్టేందుకే జగన్ అండ్ కో నకిలీ మద్యం కేసును కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆమె విమర్శించారు. జోగి రమేశ్, జనార్ధనరావు కలిసి చిత్తూరు జిల్లా ములకల చెరువులో కల్తీ మద్యం కుట్ర పన్నారని అన్నారు. జగన్ పాలనలో జే బ్రాండ్ల మద్యం వల్ల 30 వేల మంది చనిపోయి, 30 లక్షల మంది అనారోగ్యానికి గురయ్యారని ల్యాబ్ రిపోర్టులు చెబుతున్నాయన్నారు. ఫోరెన్సిక్ పరిశీలనల్లో వైసీపీ నేతల మనీ లాండరింగ్, ఆఫ్రికా దేశాల్లో మద్యం వ్యాపారాల అనుబంధాలు బయటపడ్డాయని ఆమె చెప్పారు. మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఖాతాలో రూ.5 కోట్లు జమ అయినట్లు సిట్ నిర్ధారించిందని, అయినా జగన్ వారిని ఎందుకు సస్పెండ్ చేయలేదని మాధవి ప్రశ్నించారు. మరోవైపు కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నేతలను పార్టీ వెంటనే సస్పెండ్ చేసిందని, ఇది ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. కల్తీ మద్యం నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టి, డిస్టిలరీలు, డిపోలు, మద్యం షాపులు, బార్లలో ఆకస్మిక తనిఖీలు జరుపుతోందని చెప్పారు.



మెడికల్ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

జీవితాలను మార్చే శక్తి విద్యకే ఉంది

సమాజంలో జీవితాలను మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తేజస్వినికి గురువారం ఆమె పాఠ్య పుస్తకాలు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతిభావంతులైన విద్యార్థులు ముందుకు సాగేందుకు సహకరించటం అందరి బాధ్యత అన్నారు. పరుచూరి వీరరాఘవులు సేవా సంఘం చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పరుచూరి సంజీవరావు, షేక్ చాంద్, ఖర్జూర శ్రీను, కిరణ్ పాల్గొన్నారు.

● టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి గుంటూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల కరపత్రాన్ని ఎమ్మెల్యే మాధవి ఆవిష్కరించారు.

మద్యం షాపుల వద్ద ఎక్సైజ్ సురక్ష యాప్ పోస్టర్లు

● ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు



ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో అన్ని మద్యం దుకాణాల వద్ద ఎక్సైజ్‌శాఖ వారు సురక్ష యాప్ పోస్టర్లను అతికించారు. గురువారం ఈ మేరకు సురక్ష యాప్‌ను ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి తదితరులు ఆవిష్కరించారు. గుంటూరు నగరంలోని ఎక్సైజ్ స్టేషన్ 1,2 పరిధిలోని అన్ని మద్యం దుకాణాల వద్ద సురక్ష యాప్ పోస్టర్లను ఎక్సైజ్‌శాఖ అధికారిణి అరుణ కుమారి, ఏఈఎస్‌ఈడీ మారయ్యబాబు, వన్‌టౌన్ సీఐ లతా, టూటౌన్ సీఐ యశోధరాదేవి ఇతర అధికారులు కలిసి అంటించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ, మద్యం సేవించేవారు వారు తీసుకున్న మందు కల్తీనా.. కాదా అని ఈ యాప్ ద్వారా నిర్ధారించుకోవచ్చని తెలిపారు. తమ ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని స్కాన్ చేస్తే మద్యం బాటిల్ వివరాలు బయటపడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్‌కు వినియోగదారుల ఫోరం జరిమానా

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేబుల్ టీవీ ఆపరేటర్‌కు వినియోగదారులు ఫోరం జరిమానా విధించింది. గోరంట్లకు చెందిన వేమూరి నాగమణి 2020లో శ్రీ తేజస్విని కేబుల్ నెట్‌వర్క్ ద్వారా ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్‌ను పొందారు. కొన్ని రోజుల తర్వాత కేబుల్ సరిగా పనిచేయలేదు. సుమారు సంవత్సరం పాటు కేబుల్ నెట్‌వర్క్ వారు సరైన సర్వీస్ అందించలేదు. వారిని అనేకమార్లు సంప్రదించిన ఉపయోగం లేకపోయింది. దాంతో నాగమణి కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై గుంటూరు జిల్లా కన్స్యూమర్స్ ఫోరం కేసును విచారించి శ్రీ తేజస్విని కేబుల్ టీవీ సరైన నెట్‌వర్క్ అందించలేదని నిర్ధారించి రూ. 15 వేల జరిమానా, కోర్టు ఖర్చుల కింద మరో రూ. ఐదు వేలు కలిపి నాగమణికి చెల్లించాలని తీర్పునిచ్చింది. అంతేకాక నాగమణి కోరితే తిరిగి కనెక్షన్‌ను పునరుద్ధరించాలని పేర్కొంది. ఈ మొత్తం ప్రక్రియను ఆరు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించింది.

నల్లచెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లచెరువు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికుల సమాచారంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 32 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు లాలాపేట స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

జూదరుల అరెస్టు

నగరంలోని నల్లపాడు, నగరంపాలెం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రెండు పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. నగరంపాలెం స్టేషన్ పరిధిలోని ఏటీ అగ్రహారం 15వ లైనులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 24,200 నగదు, ఏడు సెల్‌ఫోన్‌లు, ఐదు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా నల్లపాడు స్టేషన్ పరిధిలోని జేకేసీ కాలేజీ రోడ్డులో ఓ రియల్‌ఎస్టేట్ కార్యాలయంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 4 సెల్ ఫోన్‌లు, రూ. 6,030 నగదు స్వాధీనం చేసుకున్నారు.

లక్ష్మీ నరసింహ హోల్‌సేల్ మార్కెట్‌ను మూయించండి

● జీఎంసీ ఎదుట నూతన లీజుదారుల ఆందోళన

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని బుడంపాడు బైపాస్ వద్ద అనధికారికంగా లక్ష్మీ నరసింహ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారని, తక్షణమే దాన్ని మూయించాలని కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నూతన లీజుదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేపట్టి మేయర్, కమిషనర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనధికారికంగా మార్కెట్ నిర్వహిస్తున్నారని, దీనికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. తాము రూ.లక్షలు వెచ్చించి పాట పాడామని, అనధికార మార్కెట్‌ను నిర్వహిస్తూ తమను ఆర్థికంగా మరింత దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనధికార మార్కెట్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నూతన లీజుదారులు

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి

● మహిళా పోలీసులకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచన

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామ, వార్డు మహిళా పోలీసులకు సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్ మహిళా పోలీసులకు పలు ముఖ్యమైన సూచనలు, ఆదేశాలను జారీచేశారు. 'అవగాహనతోనే సైబర్ నేరాలు, మోసాలను అరికట్టవచ్చు' అనే నినాదాన్ని ఆయుధంగా తీసుకొని అవగాహన కల్పించాలని సూచించారు. 1930 జాతీయ సైబర్ భద్రత సహాయత నంబర్ గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు సమీపంగా ఉండే మహిళా పోలీసుల పాత్ర ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ఈ సందర్భం గా ఎస్పీ, అధికారులు పలు సైబర్ భద్రతా పోస్టర్లు, అవగాహన బ్రోచర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాషా, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, మహిళా కానిస్టేబుళ్లు మానస, అరుణ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్, ఐటీ కోర్ సీఐ నిసార్‌బాషా

జగన్ గుట్టును బయటపెట్టింది గూగులే

● ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జగన్ గుట్టును బయటపెట్టింది గూగులేనని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఎద్దేవా చేశారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెప్పిన అబద్ధాలు పదేపదే చెప్పడం, ప్రజల్ని నమ్మించి మోసం చేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గురువారం జగన్ విలేకరులతో మాట్లాడిన తీరు 'దృశ్యం' సినిమాను గుర్తుకు తెచ్చిందన్నారు. గూగుల్ సంస్థ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుచేస్తుంటే, దాన్ని జీర్ణించుకోలేని జగన్ అండ్ కో దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తమవల్లే డేటా సెంటర్ విశాఖకు వచ్చిందన్నట్లుగా బిల్డప్ ఇవ్వడం చూస్తుంటే ఇంతకంటే దిక్కుమాలినతనం మరొకటి ఉండదని విమర్శించారు. అప్పట్లో కీయా కార్ల కంపెనీ ఏపీకి తెచ్చింది తన తండ్రేనని, ఇప్పుడు గూగుల్ తానే తెచ్చానని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. జగన్‌ను పిచ్చి ఆసుపత్రికి తరలించి మంచి వైద్యం చేయించాలి, లేదంటే ఈ దేశానికి స్వతంత్రం కూడా తనవల్లే వచ్చిందనే చెప్పే ప్రమాదం ఉందని మోహనకృష్ణ ఎద్దేవా చేశారు.



కళాకారుల కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

కళలకు ప్రోత్సాహం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలకు అత్యధిక ప్రోత్సాహం అందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో తనను కలిసిన టీడీపీ కల్చరల్ నూతన కమిటీని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాకారులకు ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లని అన్నారు. కళలను ప్రోత్సహించడంలో సీఎం చంద్రబాబు ముందుంటారని చెప్పారు. నియోజకవర్గంలో కళాకారులకు తాము అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కల్చరల్ కమిటీ నూతన అధ్యక్షుడుగా డి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా కె.సురేష్, జనరల్ సెక్రటరీగా బి.బాల సుబ్రహ్మణ్యాచారి, సభ్యులుగా మీనా కుమారి, విజయకుమారి తదితరులు నియమితులయ్యారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ బోసుబాబు తదితరులు

నాటక రచనలు సందేశాత్మకంగా ఉండాలి

గుంటూరు (విద్య), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నాటక రచనలు సమాజానికి మేలుకొలుపుగా సందేశాత్మకంగా ఉండేలా రచయితలు చూడాలని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోసు బాబు పేర్కొన్నారు. కళా కౌముది డాక్టర్ జి.వందనం రాసిన "గర్జించిన కొదమసింహాలు" నాటకం పుస్తకాలను స్థానిక బ్రాడీపేట మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బోసుబాబు మాట్లాడుతూ, సమాజంలో రుగ్మతలను ఎత్తిచూపేలా నాటికలు ఉండాలని అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు టి.భాగ్యశ్రీ మాట్లాడుతూ, సమాజంలో పెరిగిపోతున్న హింస, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నాటకాలు ఉండాలని, అలాంటి ప్రదర్శనల ద్వారా చాలావరకు మార్పు జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో రచయిత డాక్టర్ వందనం, చిక్కాల రాజేశ్, శ్రీధర్, వినయ్, ఎం.కెనడి, శ్రీహరి, తరుణ్, సుధాకర్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో అవంతికకు గోల్డ్ మెడల్

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల విద్యార్థిని ఆర్.వల్లి అవంతిక అండర్-8 క్యాటగిరీలో గోల్డ్ మెడల్ సాధించిందని పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. జిమ్నాస్టిక్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు ఇటీవల గుంటూరులో జిల్లా జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్ సెలక్షన్ 2025-26 పోటీలు నిర్వహించారని చెప్పారు. ఈ పోటీల్లో సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆర్. వల్లి అవంతిక బంగారు పతకం సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు. విద్యార్థులు చదువులోనే కాకుండా తమకు నచ్చిన క్రీడలలో కూడా నైపుణ్యత సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గా శ్యామ్, ప్రైమరీ కో-ఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ-ప్రైమరీ కో-ఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇంచార్జి కె.హరిప్రియ పాల్గొన్నారు.


సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

పవిత్ర కార్తీకమాసంలో భక్తకోటితో సూర్యలంక సముద్రతీరం పులకించి పోతోంది. ఏటా కార్తీక మాసంలో లక్షలాది మంది భక్తులు ఇక్కడికి విచ్చేసి.. తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరిస్తారు. సూర్య నమస్కారాలతో ప్రారంభించి.. ఇసుకతో శివలింగాకృతి చేసి పూజలు చేస్తారు. కార్తీక దీపాలు వెలిగించి సముద్రంలో వదిలిపెడతారు. నిత్యం ఈ కార్యక్రమం కార్తీమాసం అంతా అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ ఏడాది భక్తజనం మరింత పెద్దమొత్తంలో తరలి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. దీనిపై ఇప్పటికే సమీక్షలు జరిపారు. తాత్కాలిక వసతుల కల్పనకు సిద్ధమయ్యారు.

కార్తీకం.. వెలుగుల తీరం

● తరలిరానున్న భక్తజనం ● ప్రకృతి ఆహ్లాదం.. వసతుల్లో నిస్తేజం ● పాలకులు ప్రగల్భాలకే పరిమితం


దాతల సహకారంతో నిర్మించిన పోలీసు వాచ్‌టవర్

బాపట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన సముద్ర కెరటాలు, ఇసుక తిన్నెలు, కాలుష్యం లేని పడవలు, కన్యాకుమారిని తలపిస్తూ.. సూర్యోదయ దర్శనం, కనుల పండుగగా బాపట్ల సూర్యలంక తీర ప్రాంతం ఉండడంతో.. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తూ ఆంధ్ర గోవాగా ఖ్యాతినార్జించింది. అయితే.. సూర్యలంక సముద్ర తీరంలో నానాటికి వసతులు కొరవడి పర్యాటకులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. కార్తీకమాసంలో పుణ్యక్షేత్రంగా భావించి.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తజనం విశేష సంఖ్యలో ఇక్కడకు వస్తారు. పాలకులు, అధికారులు వారికి శాశ్వత ప్రాతిపదికన వసతులు కల్పిస్తామని వాగ్దానాలు చేయడం పరిపాటిగా మారింది. గత ప్రభుత్వంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రిగా ఆర్కే. రోజా రెండు సార్లు ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. అభివృద్ధి విషయంలో ఆమె ఇచ్చిన హామీలు.. నీటి మూటలుగానే మిగిలిపోయాయి. సముద్రంలో ప్రమాదాలను పసిగట్టేందుకు పోలీసు అధికారులు మాత్రం దాతల సహకారంతో మూడు వాచ్ టవర్లు నిర్మించారు. మంతెన దశరథమహారాజు దాతల సహకారంతో తీరంలో శివాలయం నిర్మించారు. ఈ రెండు మినహా ఇక్కడ జరిగిన అభివృద్ధి శూన్యమని చెప్పవచ్చు. గతంలో మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని శేషగిరిరావు పర్యాటకుల సౌకర్యార్థం దుస్తులు మార్చుకునేందుకు రెండు భవనాలను నిర్మించారు. వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధి పేరిట వాటిని తొలిగించి ఎలాంటి వసతులు కల్పించలేకపోయారు. కూటమి ప్రభుత్వం పర్యాటక కేంద్రం సూర్యలంక అభివృద్ధికి ఈ ఏడాది రూ.97.52 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు పూర్తయితే.. తీరం అద్భుతమవుతుంది.

ఆసీలు వసూళ్లతో అధిక ఆదాయం

లక్షలాది మంది భక్తులొచ్చే సూర్యలంక తీరంలో కేవలం నాలుగు స్నానాల గదులు మాత్రమే ఉన్నాయి. వీటిని వేలం పెట్టి పంచాయతీ ఆదాయం సమకూర్చుకుంటోంది. తీరానికి వచ్చే వాహనాల పార్కింగ్, స్నానాల గదుల ఆసీలు వసూలు ద్వారా గతంలో పంచాయతీకి రూ.36.06 లక్షల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం మూడు నెలలకోసారి వేలం పాట పెట్టి అత్యధిక ఆదాయం రాబడుతున్నారు. అలాగే తీరంలో ఉన్న 38 షాపుల ద్వారా ఏటా రూ.11.40లక్షల ఆదాయం వస్తుంది. ఇంటి పన్ను ఇతర ఆదాయం ఏడాదికి కోటి రూపాయల వరకు ఈ పంచాయతీకి వస్తోంది. గజ ఈతగాళ్లు, పారిశుధ్య కార్మికులకు ఇందులో నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు. శానిటేషన్ సామగ్రి, లైట్లు ఇతర అవసరాలకు కూడా ఈ డబ్బులే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదాయం రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల పంచాయతీ ద్వారా వచ్చే ఆదాయం కాస్తా ఇతరత్రా అవసరాలకు వినియోగించి భక్తులకు వసతులు కల్పించడంలో విఫలమవుతన్నారనే విమర్శలు ఉన్నాయి.


సూర్యలంక తీరంలో దాతలు నిర్మించిన శివాలయం

అంతిమ యాత్రకు దారి లేక..


శవపేటికను వరిపొలం నుంచి తీసుకెళ్తున్న కాలనీవాసులు

బాపట్ల, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలోని 23వ వార్డు ఆనంద నగర్ కాలనీ శ్మశానానికి దారిలేక దశాబ్దాలుగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. శవపేటికలను పొలాల నుంచి తాడిచెట్ల మధ్య నుంచి మోసుకుంటూ శ్మశానికి తీసుకెళ్తున్నారు. కాలనీ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికి శ్మశానం సూర్యలంక రోడ్డులో ఉంది. భూమి మండల పరిధిలోకి వస్తుందని చెప్పి మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. మండలాధికారులు దారికి భూమి కొనుగోలు చేయాలంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు రైతులకు చెల్లించాల్సి వస్తుందనే సాకుతో పట్టించుకోకుండా వదిలేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి శ్మశానానికి దారి చూపించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రత్యేక రక్షణదళం సేవలు అమూల్యమైనవి

● ఘనంగా ఏపీ ఎస్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి కుమార్ విశ్వజిత్

ఏఎన్‌యూ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం సేవలు అమూల్యమైనవని (ఏపీ ఎస్పీఎఫ్) ఏపీ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ పేర్కొన్నారు. ఏఎన్‌యూలో గురువారం ప్రత్యేక రక్షణ దళం ఆవిర్భావ దినోత్సవాలు డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రివిక్రమవర్మ, ఇన్‌స్పెక్టర్ నరల్ బి.వి.రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్ విచ్చేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ఎస్‌పీఎఫ్ నియామకాలు, 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న పోలీసులకు పదోన్నతులు ప్రభుత్వ పరిశీలనలో పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్పెషల్ హోమ్ సెక్రటరీ విజయ కుమార్, ఏఎన్యూ రెక్టార్ శివరాంప్రసాద్, కమాండెంట్ బాషా, అసిస్టెంట్ కమాండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కరి మబ్బు కమ్మెను..!



అల్పపీడన ద్రోణితో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వాతావ'రణంలో' వచ్చిన మార్పులతో.. కరి మబ్బులు వినుకొండ పట్టణాన్ని కమ్మేశాయి. పట్టణంలోని మున్సిపల్ సెంటరులో గురువారం ఉదయం 11 గంటలకు ఆకాశంలో ఆవిష్కృతమైన దృశ్యం పట్టణ వాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. నల్లటి మేఘాలు మీద పడుతున్నట్లుగా.. ఒక్కచోటికి చేరాయి.

-వినుకొండటౌన్, ఆంధ్రజ్యోతి

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

బిలియర్డ్స్ పోటీల ప్రారంభోత్సవంలో శాప్ చైర్మన్ రవినాయుడు


పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు, క్లబ్ కార్యదర్శి దుర్గారావు, అధ్యక్షుడు బ్రహ్మేశ్వర రావు, వెంకటేశ్వరరావు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఇస్తున్న సదుపాయాలను వినియోగించుకొని అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడానికి కృషి చేయాలని శాప్ చైర్మన్ ఎ. రవినాయుడు పేర్కొన్నారు. గురువారం ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బిలియర్డ్స్ అండ్ స్నూకర్ కాంప్లెక్స్‌లో ఏపీస్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద అనేక మంది క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్‌లో కూడా ప్రతిభ కనబరిచిన వారికి స్పోర్ట్స్ ఇన్సెంటివ్ పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పీ4 విధానంలో క్రీడాకారులనూ దత్తత తీసుకుని, కొన్ని క్రీడలను స్పాన్సర్ చేసి పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేయాలని సూచించారు. క్లబ్‌లో ఇలాంటి క్రీడా సౌకర్యాలు కల్పించిన యాజమాన్యాన్ని అభినందించారు. పోటీల నిర్వహణ కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరావు (అజార్) మాట్లాడుతూ ఈ పోటీలు నవంబరు 3 వరకు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామని, జనవరిలో హరియాణాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్లబ్ కార్యదర్శి యాగంటి దుర్గారావు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మరిన్ని క్రీడా పోటీలకు ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ వేదిక అవుతుందన్నారు. అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావు ఉపాధ్యక్షుడు వణు కూరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఏల్చూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షం..

● వర్షాలకు పంటలు నష్టం
● సస్య రక్షణ చర్యలు సూచిస్తున్న అధికారులు

తక్షణ రక్షణే కర్తవ్యం


పత్తి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాఖ జేడీ జగ్గారావు

నరసరావుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో అధిక వర్షాలు జిల్లా అంతటా కురుస్తున్నాయి. వానలు పంటలకు నష్టాన్ని కలిగిస్తున్నా యి. వర్షాల వలన కలిగే నష్టాలను నివారించుకునేందుకు రైతులకు వ్యవసాయ శాఖ జేడీ జగ్గారావు సూచనలు చేశారు. ఆ యన గురువారం పంట పొలా లను పరిశీలించి వర్షాలు కురు స్తున్న సమయంలో వరి, పత్తి, కంది, మొక్క జొన్న పంటల్లో తీసుకొవాల్సిన ముందస్తు జాగ్రత్తలను రైతులకు తెలిపారు. రైతులు ఈ కింది జాగ్రత్తలు పాటించి పంట నష్టాన్ని నివారించుకొవాలని సూచించారు.

వరిలో జాగ్రత్తలు

వరి పంట దుబ్బు చేసే దశలో ఉంది. పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలి. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉంది. 0.2 గ్రాములు ప్లాంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి. కాండం కుళ్లు నివారణకు.. 2. 5 గ్రా. కార్బెండజిమ్ + మ్యాంకోజేబ్ శిలీంధ్ర నాశక మందును లేదా ఒక మిల్లీ లీటరు వాలిడామైసిన్ కాని లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అగ్గి తెగులు గమనించినట్లయితే 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశిస్తే నత్రజని వేసుకోవడం వాయిదా వేసుకోవాలి.

పత్తి పంటలో మేళకువలు

పత్తి పంట ప్రస్తుతం పూత, కాయలు పెరిగే స్థితిలో ఉంది. పొలంలో వీలైనంత త్వరగా మురుగు నీరు పోయే అవకాశం కల్పించాలి. వెంటనే అంతర కృషి చేసి, నేల ఆరేటట్లు చేయాలి. పైపాటుగా ఎకరానికి 25-30 కేజీల యూరియా+10-15 కేజీల పోటాష్ ఎరువులను అందించాలి. మురుగు పోయే అవకాశం లేనప్పుడు నత్రజని, పొటాషియం (2శాతం పొటాషియం నైట్రేట్), లేదా 2 శాతం యూరియా, మెగ్నీషియం (ఒక శాతం మెగ్నీషియం సల్ఫేట్)ను 5 - 7 రోజులు వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు అందించాలి (బలహీన పడ్డ వేరు మండలానికి సాయంగా). వీటి ద్వారా పండాకు తెగులును కూడా సమర్థంగా అదుపులో ఉంచవచ్చు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన అనంతరం ఎకరాకు 25 కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం.మీ దూరంలో పాదులు తీసి ఎరువులను వేసి మట్టితో కప్పాలి.

మిరప పంట రక్షణ: మిరప పంటలో అధిక తేమ వలన వేర్ల ద్వారా మొక్కకు అవసరమైన పోషకాలను తీసుకోలేదు. పంటను పురుగులు, తెగుళ్ల ఆశించడమే కాకుండా సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువగా కనపడే అవకాశం ఉంది. పంట దశ ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రత్తలు పాటించినట్లయితే నష్టాన్ని కొంత వరకు తగ్గించుకునే అవకాశం ఉంది. జూలైలో వేసిన మిరప పంట ప్రస్తుతం పూత నుంచి కాయ ఏర్పడే దశలోను నారు పెంచి ఆగస్టు, సెప్టెంబర్ నెలలో నాట్లు వేసిన మిరప పొలాలు శాఖియా దశలో ఉంది. పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకు పంపించే ఏర్పాటు చేయాలి. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి.

సంక్లిష్టంగా పత్తి కొనుగోలు!

గతేడాది సీఎం యాప్‌లోనే ప్రక్రియ మొత్తం నిక్షిప్తం

● కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌తో కొరవడిన అవగాహన ● యాప్‌లో సమస్య తలెత్తితే..పరిష్కారం ప్రశ్నార్థకం



గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా ఈ నెలాఖరులోపే ప్రత్తి కొనుగోళ్ల ప్రారంభం కానుండగా.. ఇప్పటి వరకు వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, సిబ్బందికి నూతన విధానంపై అవగాహన కొరవడింది. కొనుగోళ్ల ప్రక్రియని సులభతరం చేయాల్సిన సీసీఐ అందుకు భిన్నంగా సంక్లిష్టం చేసింది. గత సీజన్ వరకు సీఎం యాప్‌తోనే ప్రక్రియ మొత్తం పూర్తి అయిపోయేది. ఈ సంవత్సరం ఎందుకనో కపాస్ కిసాన్ యాప్ అంటూ ఒక దానిని తీసుకొచ్చింది. దీని వినియోగంపై కింది స్థాయి సిబ్బందికి సరైన అవగాహన లేదు. ఈ యాప్‌ని వినియోగించేందుకు ఎవరికి ప్రత్యేకించి లాగిన్ సదుపాయం లేదు. ఎవరైనా ఉపయోగించొచ్చు. అయితే రైతులకు స్పష్టమైన అవగాహన ఉండదు కాబట్టి కొనుగోళ్ల సందర్భంగా ఈ యాప్ వలన సమస్యలు తలెత్తకుండా ఎవరు చూస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

గిట్టుబాటు కానీ బహిరంగ మార్కెట్ ధర

ఈ ఏడాది పల్నాడు జిల్లాలో 90,872, గుంటూరులో 23,934, బాపట్లలో 1834 హెక్టార్లలో రైతులు పత్తి పంట వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదించారు. అత్యధికంగా పల్నాడు జిల్లా నుంచి 1,35,235 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. గుంటూరులో 34,124 ఎంటీలు, బాపట్లలో 1962 ఎంటీల దిగుబడి రావొచ్చని భావిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనందున రైతులు తప్పక సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.

సంక్లిష్టంగా విక్రయ ప్రక్రియ

రైతు తన పంటని సీసీఐ కేంద్రాల్లో అమ్ముకోవాలంటే ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. తొలుత రైతు సేవా కేంద్రానికి వెళ్లి అక్కడ గ్రామీణ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలి. తన ఆధార్, మొబైల్ నంబరు ద్వారా సీఎం యాప్‌లో రిజిస్టర్ చేయించాలి. ఆ యాప్‌లో రైతుకు సంబంధించిన అన్ని వివరాలు వస్తాయి. దానిని ఈ-క్రాప్ డేటాతో క్రాస్ చెక్ చేస్తారు. అప్పుడే కపాస్ కిసాన్ యాప్‌ని వినియోగించి మొబైల్ నంబరు, ఎస్ఎంఎస్ ధ్రువీకరణ ద్వారా షెడ్యూలింగ్ చేస్తారు. షె డ్యూల్ ప్రకారం రైతు తన వద్ద ఉన్న పంట దిగుబడిని తీసుకొని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి వెళ్లాలి. మొదటి కోత అయితే 40 శాతం వరకు విక్రయించడానికి అవకాశం ఉంది. రెండో కోత సమయంలో 60 శాతం, మూడో కోత సమయంలో 100 శాతం అమ్ముకోవచ్చు. రైతు కొనుగోలు కేంద్రానికి వచ్చిన తర్వాత అక్కడ ఉండే మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మళ్లీ సీఎం యాప్‌లో లాట్ నంబరుని జనరేట్ చేస్తారు. ఆ లాట్‌లో ఎంత పత్తి ఉందో కూడా నమోదు చేస్తారు. అప్పుడే గేట్ పాస్‌ని ప్రాసెసింగ్ చేస్తారు. అనంతరం సీసీఐ బయ్యర్ పత్తి రకం, క్వాలిటీ గణాంకాలను నమోదు చేస్తారు. క్వాలిటీ గణాంకాలను బట్టి ఆటోమేటిక్‌గా యాప్‌లోనే రైతుకు ఎంత ధర చెల్లిస్తారో నిర్ధారణ జరుగుతుంది. రైతుకు ఆ ధరని చూపించిన తర్వాత ఆయన ఆమోదంతోనే బిడ్డింగ్ స్లిప్‌ని జనరేట్ చేస్తారు. అప్పుడు కాటాలు వేసి ఎంత ధర అయితే ఆ తూకానికి చెల్లిస్తారో చెబుతారు. రైతు ఆమోదంతో ఫొటో, వేలిముద్ర సేకరించి తూకం, ధరని లాక్ చేస్తారు. దీని తర్వాత సీపీవో, ఏఎంసీ సూపర్‌వైజర్ వేలిముద్రలు వేయాలి. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత ఏఎంసీ సెక్రెటరీ అన్ని వివరాలను చెక్ చేసి తక్‌పట్టిని ఆమోదిస్తారు. అనంతరం తక్‌పట్టి స్లిప్ జనరేట్ చేసి తుది వివరాలను సీపీవోకు పంపుతారు. ఆయన వాటిని సీసీఐకి పంపించి నగదు చెల్లింపు ప్రక్రియకు సిఫార్సు చేస్తారు. చివరగా ఆధార్ లింకు అయి ఉన్న బ్యాంకు అకౌంట్‌కి మాత్రమే నగదుని జమ చేస్తారు.

ఏ చిన్న సమస్య వచ్చినా..మళ్లీ మొదటికి

ఈ ప్రక్రియలో ఏ చిన్న సమస్య వచ్చినా కొనుగోళ్లు నిలిచిపోతాయి. నెట్‌వర్కు సరిగా లేకపోయినా, సాంకేతిక సమస్యలు తలెత్తినా రైతుకు ఇబ్బందులే. రైతు షెడ్యూలింగ్ చేసిన రోజున వాహనం మరమ్మతులకు గురి కావడం, కూలీలు రాకపోవడం, వర్షం వంటి ప్రకృతి విపత్తులు సంభవిస్తే ఆ రోజు స్లాట్‌ని రద్దు చేస్తారు. మళ్లీ స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సిందే. సెక్రెటరీలలోనే చాలామందికి ఈ విధానంపై స్పష్టత కొరవడింది. మార్కెటింగ్ శాఖ నియమించిన టెక్నికల్ సిబ్బంది కూడా సరిగా అవగాహన కల్పించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో వారం వ్యవధిలో ప్రారంభం కానున్న పత్తి కొనుగోళ్ల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తుతాయోనన్న భయం అందరిలో నెలకొంది.

భారీ వర్షాల నేపథ్యంలో కాల్ సెంటర్ ఏర్పాటు

మంగళగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా తెలిపారు. ఎక్కడైనా ముంపు సంభవించినా, భవనాలు, గోడలు, స్తంభాలు ప్రమాద స్థితిలో ఉన్నాయని గుర్తించినా దగ్గర్లోని సచివాలయంలో కానీ, కాల్ సెంటరు నంబర్లు 7093912653, 08645-295193కు సమాచారం అందించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న గోడలు, పాత భవనాలు కూలే ప్రమాదం ఉందని, కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే మలేరియా, టైఫాయిడ్, డెంగీ, డయేరియా, వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు తాగునీరు, ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు, మందులు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల బంద్

దుగ్గిరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా పశ్చిమడెల్టాకు గురువారం నుంచి సాగునీటి విడుదలను నిలిపి వేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీవర్షాల కారణంగా కాల్వలు నిండిపోయాయని, పొలాల్లో వర్షపునీరు తొలగిపోయేందుకు వీలుగా అన్ని చానళ్ల నుంచి నీటి విడుదలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. అల్పపీడన ప్రభావంతో దుగ్గిరాల మండలంలో 74.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తాడేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించామని, తదుపరి ఉత్తర్వుల వరకు సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటారని తహసీల్దార్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఏమైనా ఇబ్బందులుంటే కంట్రోల్‌రూం నెంబరు 8790376195కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● తహసీల్దార్ హేనప్రియ

పెదనందిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హేనప్రియ సూచించారు. వాగులు, వంకలు, రహదార్లపై నీరు ప్రవహించే సమయంలో రాకపోకలు కొనసాగించవద్దని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని కోరారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కిందకు వెళ్లవద్దని సూచించారు. మండలంలో గురువారం 12.6 మి.మీ వర్షపాతం నమోదయిందని తహసీల్దార్ తెలిపారు.

● ఫిరంగిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గ్రామంలోని అంతర్ రహదారులు, కాలనీలు, గృహాల్లోకి వర్షపు నీరు వచ్చినట్లయితే స్థానిక పంచాయతీ అధికారులకు తెలియపరచాలన్నారు. ఏమైనా ఫిర్యాదులు, సమాచారం ఉంటే ఎంపీడీవో నెంబరు 7032983510లో సంప్రదించాలని ఎంపీడీవో కోరారు. కాగా, ఫిరంగిపురంలో గురువారం 25.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి శుభాకాంక్షలు

తాడేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీపీఐ నూతన కార్యదర్శిగా ఎన్నికైన జి.ఈశ్వరయ్యను గురువారం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు ముసునూరు సుహాస్, సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమిల్ల వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం విజయవాడలోని దాసరిభవన్‌కు వెళ్లి ఈశ్వరయ్యను సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణం



నిడమర్రులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

మంగళగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిడమర్రు గ్రామంలో చిన్న హైస్కూల్ రోడ్డు అధ్వానంగా మారడంతో తరచు నీరు నిలిచి గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ నాయకుల ద్వారా సమస్యను తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని ఆదేశించారు. దీంతో నిడమర్రు చిన్న హైస్కూల్ వద్ద నుంచి కురగల్లు రోడ్డు వరకు రూ.14 లక్షల ఎంటీఎంసీ సాధారణ నిధులతో 175 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మంత్రి లోకేశ్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

దుకాణాలు ప్రారంభం

ఫిరంగిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 113 తాళ్ళూరు, వేములూరిపాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ద్రావణాలు, కషాయాల దుకాణాలను జిల్లా మాస్టర్ ట్రైనర్ కుంటా వరప్రసాదు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా తక్కువ ఖర్చుతో కషాయాలు, ద్రావణాలను అన్ని రకాల పురుగుల, తెగుళ్ళ నివారణకు వాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నామణి, జిల్లా మోడల్ మేకర్ ఇర్ల వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జీలు తిరుపతిరావు, రామకృష్ణ, ఐసీఆర్‌పీలు రజని, మహిళా గ్రూపులు, రైతులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం

● దిగబడుతున్న వాహనాలు ● గంటల కొద్ది ట్రాఫిక్ జామ్



సాయంత్రానికి బోల్తా కొట్టిన ఇంకో లారీ



తుళ్లూరు పెదపరిమి అర్‌అండ్‌బీ రోడ్డులో దిగబడిన లారీ బోల్తా పడిన మరో లారీ

తుళ్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు - పెదపరిమి మధ్యలో అర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో వాహనాలు దిగి బోల్తా కొడుతున్నాయి. కొన్ని దిగబడిపోయి గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రాజధాని ప్రాంతం కావటంతో ట్రాఫిక్ పెరిగిందని, అయితే రోడ్డు మాత్రం బాగుపడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఒక లారీ బోల్తా పడగా. మరొకటి అక్కడే ఇరుక్కుపోయింది. దీంతో స్కూల్‌కు వెళ్లే బస్సులు ఆగిపోయాయి. రాష్ట్ర సచివాలయానికి, హైకోర్టుకు ఉద్యోగుల బస్సులు గంటల తరబడి నిలిచిపోయాయి. అధికారులు హుటాహుటిన భారీ క్రేన్‌లతో లారీలను తొలగించారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సాయంత్రానికి మరో లారీ బోల్తా పడింది. అదే స్కూల్ బస్సో. ప్రయాణికుల ఆర్టీసీ బస్సైతే ఏం జరిగేదో ఊహించుకోవచ్చు. రెండు రోజుల క్రితం రెండు లారీలు దిగబడిపోయి రాత్రి వేళ ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొండవీటి, ఎర్రవాగులను పరిశీలించిన కలెక్టర్



కంతేరు రోడ్డులోని కొండవీటి వాగును పరిశీలిస్తున్నకలెక్టర్ అన్సారియా

తాడికొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలంలో ప్రవహించే కొండవీటి వాగు, ఎర్రవాగులను, కంతేరులోని అండర్ పాస్ బ్రిడ్జిని కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి తాడికొండ రహదారిలో నిర్మించిన అండర్‌పాస్‌లో అధిక వర్షాలకు 15 అడుగుల మేర నీళ్లు నిలబడ్డాయని, దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని కంతేరు టీడీపీ నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా రు. ఎర్రవాగులో వరద ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల పంట పొలాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. స్పందించిన కలెక్టర్ కొండవీటి వాగు, ఎర్రవాగులో గండి ప్రదేశాలను గుర్తించి అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పనులుంటేనే బయటకు రావాలని కోరారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

హైకోర్టు ఆదేశాలతో వినాయకుడి మండపం తొలగింపు



షెడ్డును తొలగిస్తున్న అధికా రులు

తుళ్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ఆదేశాలతో తుళ్లూరులోని గీతా మందిరం సెంటర్లో చెరువు కట్ట మీద ఉన్న వినాయకుడి మండపాన్ని గురువారం అధికారులు తొలగించారు. 18 సంవత్సరాల నుంచి వినాయక చవితి ఉత్సవాలను కట్టమీద మండపాన్ని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది చవితి సందర్భంగా కట్ట మీద 20 అడుగుల ఎత్తులో షెడ్డును నిర్మించారు. దీనిని అధికార పార్టీకి చెందిన ఒక వర్గం వ్యతిరేకించింది. చెరువుకట్ట మీద ఆక్రమణలు చేయవద్దంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. షెడ్డు నిర్మించిన మరో అధికార పార్టీ వర్గం కూడా చెరువు కట్టల మీద ఆక్రమణలుపై చర్యలు తీసుకోండని హైకోర్టును ఆశ్రయించింది. అధికారులకు అర్జీలను కూడా సమర్పించింది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన షెడ్డు నిర్మాణంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించటంతో తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీవో శిల్ప, పంచాయతీ సెక్రటరి రమణ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు షెడ్డును తొలగించారు. సీఐ కొంకా శ్రీనివాసరావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే షెడ్డులో వినాయకుడి విగ్రహం ప్రతిష్ఠించి ఉంది. షెడ్డు తొలగింపుతో విగ్రహం ఎండకు ఎండుతూ వానకు తడుస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మహాసభలో ప్రసంగిస్తున్న ఉమామహేశ్వరరావు

మంగళగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం సంఘటితమై ఉద్యమించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో గురువారం ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ 12వ మహాసభ జరిగింది. మహాసభకు ఆర్‌వేణు, వి.వెంగమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా నేటి వరకు పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కార్మికులపై పనిభారం పెంచేలా తీసుకున్న పని గంటల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని ముఖ్యమంత్రిని, మున్సిపల్‌శాఖ మంత్రిని అనేక మార్లు కలిసినప్పటికీ సమస్యను పరిష్కరించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది కార్మికులు, ఉద్యోగులను తొలగించారని, ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక చట్టాలను కూటమి ప్రభుత్వం బలపరుస్తోందని, ఇలాంటి విధానాలపై రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సీఐటీయూ నేతలు దండా లక్ష్మీనారాయణ, బి.ముత్యాలరావు, పి.రామచంద్రరావు, బి.లక్ష్మణరావు, ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, బి.వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, యూ.దుర్గారావు, శివపార్వతి, హుస్సేన్ వలి పాల్గొన్నారు.

వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం

● జలమయమైన రోడ్లు, కాలనీలు

● ఆందోళనలో మిర్చి, మాగాణి రైతులు



మిర్చి తోటల్లో నిలిచిన నీరు

దుగ్గిరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపిలేని వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు, కాలనీలు జలమయ్యాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షంతో వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకాలేని పరిస్థితి నెలకొంది. భారీవర్షంతో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అల్పపీడన ప్రభావంతో అధిక వర్షంతో మురుగునీరు రోడ్లపైకి పొర్లింది. పలుగ్రామాల్లోని ఎన్టీఆర్ కాలనీల్లో బురదమయమైన రోడ్లతో పేదప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దుగ్గిరాల సుగాలీకాలనీలో పూర్తిగా దెబ్బతిన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, ఈవో వివేకానంద పరిశీలించారు. వర్షాలతో పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కమ్యూనిటీ హాలుకు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.



పాఠశాలను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

● వట్టిచెరుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా మండలంలో భారీ వర్షం కురుస్తోంది. వర్షం కారణంగా ప్రధానంగా మాగాణి భూముల్లోని వరితో పాటు మెట్ట సాగులో మిర్చి పంటపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వేసిన వరి సాగు ప్రస్తుతం చిగురు, పొట్ట, సుంకు దశలో ఉంది. ఈ దశలో నీరు చేరి మానుగాయ, తాలు కంకులు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని అనంతవరప్పాడు, లేమల్లెపాడు, ముట్లూరు, కోవెలమూడి, తదితర గ్రామాల పరిధిలో వేసిన మిర్చి పైరులో నీరు నిల్వ ఉండటంతో పైర్లు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటివరకు ఒక మోతాదులో ఉన్న వర్షం మిర్చి సాగుకు అనుకూలమైనప్పటికీ, ప్రస్తుతం వర్షంతో మొక్కలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి : ఎంఈవో

పెదనందిపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి జాకబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ఈ నెల 30 వరకు ఆయా జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆధార్ అనుసంధానం కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు ఆధార్‌పై అవగాహన కల్పించాలన్నారు. 24 నుంచి 29 వరకు జిల్లా పరిషత్ హై స్కూల్ పెదనందిపాడు, 24న అన్నపర్రు, 25న కొప్పర్రు, 27న ఏబీపాలెం, 28న గోగులమూడి, 29న ఉప్పలపాడు, 30న పుసులూరు, పాలపర్రు పాఠశాలల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

● కాకుమాను : మండల వ్యాప్తంగా ప్రభుత్వం చిన్నారులకు నిర్వహించే ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ సూచించారు. శుక్ర, శనివారం కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాల, చిన్నలింగాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25న రేటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 27, 28న గరికపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమ్మూరు, బోడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, 29, 30న కాకుమాను, కొండపాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఆయా గ్రామాలలోని వార్డు సచివాలయాల వద్ద ఉచిత ఆధార్ క్యాంప్‌ను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వివరించారు.

ఏపీఎన్‌జీవో అధ్యక్షుడిగా సాంబశివరావు



ప్రమాణం చేస్తున్న ఏపీఎన్‌జీవో నూతన సభ్యులు

దుగ్గిరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల, కొల్లిపర మండలాల ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నికలు గురువారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించారు. అధ్యక్షుడిగా తిరువీధుల సాంబశివరావు, సహాధ్యక్షుడిగా పఠాన్ అహ్మద్ అలీఖాన్, ఉపాధ్యక్షుడిగా డీఎస్ఎస్‌పి శాస్త్రీ, వై.ప్రశాంతి, కేవీ నాగేశ్వరరావు, కార్యదర్శిగా సతీశ్, సంయుక్త కార్యదర్శులుగా ఉమామహేశ్వరరావు, వేము లక్ష్మి, బి.మాధవి, బాలకృష్ణ, కోశాధికారిగా రాంబాబు, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జాయింట్ సెక్రటరీ జానీబాషా, శ్రీరాములు తెలిపారు

రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

పెదనందిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆ శాఖ ఏఈఈ సాయికృష్ణ తెలిపారు. పెదనందిపాడు 2వ వార్డుకు చెందిన సుబ్బయ్య పీజీఆర్ఎస్‌కు రోడ్ల మరమ్మతుల కోసం ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పెదనందిపాడు చేరుకొని రోడ్లను పరిశీలించారు. గుంటూరు నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దు వరకు రోడ్ల మరమ్మతులకు రూ.8 కోట్లకు ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. ప్రత్తిపాడు, వరగాని, పెదనందిపాడు గ్రామాల్లోని రోడ్లకు సంబంధించి ఒక్కో గ్రామానికి రూ.40 లక్షల ప్రత్యేక ప్రణాళికలతో ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని ఆయన చెప్పారు.

జిల్లాస్థాయి పోటీలకు నిడమర్రు లీప్ పాఠశాల విద్యార్థులు



క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన అండర్-17 బాలబాలికల క్రీడా పోటీల్లో మంగళగిరి మండలం నిడమర్రు లీప్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బాలుర కబడ్డీలో వి.హేమంత్, ఎం.సంజయ్, బాలికల ఖోఖోలో ఎస్.కల్యాణి, వి.పుష్పలత, బాలుర వాలీబాల్‌లో ఎస్.ప్రేమ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయురాలు కాకుమాను సునీత తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం యలమంచిలి దుర్గాభవానీ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఇళ్ల పట్టాలు, స్థలాల సమస్యపై ఆందోళనలు



మాట్లాడుతున్న సీపీఎం నేత రామారావు

మంగళగిరి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు, స్థలాలు మంజూరు చేయాలనే డిమాండ్‌తో దశల వారీగా ఆందోళనలు చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు చెప్పారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో గురువారం పట్టణ కమిటీ సమావేశం ఎం.చలపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు, స్థలాలు ఇస్తామని చెప్పి 17 నెలలు కావొస్తున్నా హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజలను కూడగట్టి ఉద్యమిస్తామని హెచ్చరించారు. మంగళగిరిలో కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా 40 వేల కుటుంబాలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నాయని, కొంత మందికి ఇళ్ల పట్టాలు వచ్చాయని చెప్పారు. మిగిలిన వారికి కూడా పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్ మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయని, శివారు ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయని చెప్పారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు రాఘవులు, ఎం.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.రామచంద్రరావు, ఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

324వ రోజుకు సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారంతో 324వ రోజుకు చేరుకున్నాయి. గురువారం నాటి దీక్షలను యూనియన్ నేత కె.స్టీవెన్, దామవరపు నాగేశ్వరరావు, షేక్ ఆసిఫ్, బి.సూర్యప్రకాష్, యస్.మాణిక్యాలరావు ప్రారంభించారు. దీక్షల్లో ఏనుగుల సాంబశివరావు, రమాదేవి, ఈదులమూడి శారమ్మ, తుపాకుల నాగేశ్వరరావు, మండేపూడి ఆశీర్వాదం కూర్చున్నారు. పలువురు కార్మికులు దీక్షా శిబిరం వద్దకు విచ్చేసి మద్దతు ప్రకటించారు.

ఉపాధి కల్పనపై దృష్టి సారించాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, పాల్గొన్న జడ్పీ సీఈవో జ్యోతిబసు తదితరులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఉపాధి సౌకర్యాలను పరిశీలించి, అర్హులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరు విద్యానగర్ లోని క్యాంపు కార్యాలయంలో ఉన్నాతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా పెద్ద ఎత్తున జీవనోపాధి సౌకర్యాలు కల్పించాలన్నారు. దీన్ దయాళ్ పథకంలో ఉన్న జీవనోపాధుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో బీఎంసీయూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిధులు, ఇతర సమస్యలను పరిష్కరించి, కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డ్వామా పీడీ శంకర్, డీఆర్డీఏ అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న అధికారి

● వర్షంలో తడుస్తున్న వ్యక్తికి రెయిన్ కోటు, ఆర్థిక చేయూత



రెయిన్‌కోటు ఇస్తున్న ఐటీ అధికారి రమేశ్

గుంటూరు (విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఐటీ విభాగంలో పని చేస్తున్న అధికారి వర్షంలో తడుస్తున్న వ్యక్తికి రెయిన్‌కోటు ఇచ్చి ఆర్థిక చేయూత అందించారు. అమరావతిలోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో ఐటీ విభాగం అధికారి రమేశ్ గురువారం గుంటూరు నుంచి విజయవాడ వెళ్తున్న సమయంలో రోడ్డు పక్కన వర్షంలో తడుస్తూ, చలిలో వణుకుతూ ఉన్న ఒక వృద్ధుడిని గమనించారు. ఆ వృద్ధుడి దుస్థితి చూసి మనసు కదిలిన రమేశ్ వెంటనే తన కారును ఆపి, తాను ధరించిన స్వెట్టర్ తీసి అతడికి తొడిగారు. అంతేకాకుండా కొంత మొత్తం ఆర్థిక సాయం కూడా చేశారు. ఆయన దయ, ఉదారత మరికొంత మందికి స్ఫూర్తినిస్తుందని ఎంఈవో ఖుద్దూస్ అన్నారు.

మెగా వైద్య శిబిరం

దుగ్గిరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ, కిమ్స్ శిఖర వైద్యశాలల సంయుక్త ఆధ్వర్యంలో రేవేంద్రపాడులో ఉచిత మెగా వైద్య పరీక్ష శిబిరాన్ని గురువారం నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధుల కోసం ఎకో 2డీ, ఈసీజీ పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ కోసం మామోగ్రఫీ పరీక్షలు, క్యాన్సర్ బారిన పడకుండా గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసి పలు సూచనలు చేశారు. డాక్టర్ యశ్వంత్, శిరీష, సాంబశివరావు, అఖిల తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శిబిరంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలువురు వైద్యసిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

26న కవిరాజు త్రిపురనేని సూతపురాణ శత వసంతోత్సవం

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి రచించిన సూతపురాణం శత వసంతాల ఉత్సవం ఈ నెల 26న నిర్వహించనున్నారు. కవిరాజా పార్కులో జరిగే ఉత్సవంలో ఆయన చదివిన అష్టదశ పురాణాలపై రాసిన సూత పురాణం విశేషాలను చర్చిస్తారు. సాహిత్యవేత్త ముత్తేవి రవీంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించే సభలో హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య, విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు సాంబశివరావు ప్రసంగిస్తారని శివకృష్ణ తెలిపారు.



మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

చెంచుపేట ఓవర్ బ్రిడ్జి గోడలపై మొక్కల తొలగింపు

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చెంచుపేటలోని ఓవర్ బ్రిడ్జి గోడలపై మొక్కలను ఆర్ అండ్ బీ అధికారులు తొలగింపజేశారు. జిల్లా కలెక్టర్‌కు సెప్టెంబరు 22న నిర్వహించిన గ్రీవెన్స్‌లో సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. రైల్ ఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్ ఇరువైపులా రైల్వే లైన్లు వెళ్లే పైభాగంలో దెబ్బతింది. మిగిలిన భాగాన్ని ఆర్ అండ్ బీ అధికారులు ఇటీవల జరిగిన మరమ్మతుల్లో ఫుట్‌పాత్‌ను బాగు చేశారు. రైల్వే అధికారులు అనుమతి తీసుకోకపోవడంతో రైల్వే లైన్ వెళ్లే పైభాగంలోని ఫుట్‌పాత్ మరమ్మతులు చేయకుండా వదిలివేశారు. దీంతో ఫుట్‌పాత్‌పైన కాంక్రీటు శ్లాబు దెబ్బతిని రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యతోపాటు బ్రిడ్జికి ఇరువైపులా గోడలపై రావి మొక్కలు మొలిచి పెద్దవి అవుతుండటంపై వినతి పత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్ నుంచి ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదుపత్రం చేరడంతో మొక్కలు తొలగించారని, ఫుట్‌పాత్ మరమ్మతులు కూడా చేయించాలని సీపీఎం నాయకుడు బాబుప్రసాద్ కోరారు.



టీటీడీ సైట్‌లో ఆర్జిత సేవల బుకింగ్‌లో కనిపిస్తున్న ఎర్రర్

టీటీడీ ఆన్‌లైన్ సేవలపై భక్తుల అసహనం

▶▶ తొలి నిమిషం నుంచే ఎర్రర్

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జనవరి నెలకు గాను ఆర్జిత సేవల కోసం టీటీడీ వెబ్‌సైట్‌లో బుకింగ్ కోసం గురువారం పది గంటలకు విడుదల చేశారు. రెండు మూడు నెలల నుంచి సేవలలో సహస్ర దీపాలంకరణ మినహా మిగిలిన అన్ని సేవలు తొలి నిమిషం నుంచే బుకింగ్ ఇన్ ప్రోగ్రెస్ అంటూ ఎర్రర్ రావడంతో సేవల కోసం ఎదురు చూస్తున్న భక్తులకు నిరాశ మిగిలింది. నెలలో సేవలు కేటాయించిన అన్ని రోజుల్లోనూ భక్తులు ఆన్‌లైన్‌లో బుకింగ్ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. బుకింగ్ ప్రారంభమైన పది గంటల నుంచే ఎంత ప్రయత్నించినా ఒక్క సేవ కూడా బుక్ అవ్వలేదని పలువురు వాపోతున్నారు. ప్రతిరోజు కొన్ని సేవలకు వందలాది టిక్కెట్లు ఉన్నప్పటికీ బుకింగ్ అలిరెడీ ఇన్ ప్రోగ్రెస్ ఎర్రర్ రావడంతో విసుగెత్తిపోయారు. తొలి నిమిషం నుంచి ఎర్రర్ రావడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఇదే పరిస్థితి ఉందని ప్రభుత్వం మారినప్పటికీ ఆన్‌లైన్ బుకింగ్ విధానం ఇదే మాదిరి ఉండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎర్రర్‌లపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు విచారణ చేయాలని భక్తులు కోరుతున్నారు.



వర్ధంతి సభలో మాట్లాడుతున్న నీలాంబరం

సమాజాన్ని చైతన్యపర్చిన టి.కృష్ణ చలనచిత్రాలు

● ప్రజానాట్య మండలి జిల్లా సంఘ ప్రతినిధి నీలాంబరం

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యపరిచే చలన చిత్రాలను దర్శకుడు టి.కృష్ణ నిర్మించారని ప్రజానాట్య మండలి జిల్లా సంఘ ప్రతినిధి నీలాంబరం పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో సినీ దర్శకుడు టి.కృష్ణ 34వ వర్ధంతి గురువారం నిర్వహించారు. ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక రుగ్మతలపై తన సినిమాల ద్వారా బాణాలు ఎక్కుపెట్టారని, ఆయన తీసిన ఆరు సినిమాలు సంచలనం కలిగించాయన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం తీసిన రేపటి పౌరులు సినిమా గొప్ప విజయం సాధించిందని చెప్పారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అన్వేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షం పడితే చిత్తడే..!

▶▶ జగనన్న కాలనీలో మోకాలి లోతు నీరు

▶▶ ఇక్కట్లు పడుతున్న కాలనీ వాసులు



బురదతో ఉన్న జగనన్న కాలనీ రహదారులు



బురద రహదారులపై ఇక్కట్లుపడుతున్న వాహన చోదకులు

చేబ్రోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థలు సరిగా లేకపోవడంతో వర్షం పడినపుడు రోడ్లు మోకాళ్ల లోతు నీటితో నిండిపోతున్నాయి. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో చేబ్రోలు, కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 560మందికి జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా, అందులో 200 మందికి పైగా ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. బురదమయమైన వీధుల్లో చిన్నపిల్లలు, వృద్ధులు నడవలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. రాత్రివేళల్లో పాముల సంచారం పెరిగిపోవడంతో, కొంతమంది భయంతో అద్దె ఇళ్లకు వెళ్ళిపోతున్నారు. ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కాలనీ అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టి సమస్యలను తొలగించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు

● జన జీవనానికి అంతరాయం

● దుగ్గిరాలలో అత్యధిక వర్షపాతం నమోదు

● లోతట్టు ప్రాంతాలు జలమయం



తెనాలిలో పల్లపు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీరు, వర్షం నీటిలో చిరువ్యాపారి ఇక్కట్లు

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పట్టణంతో పాటు డివిజన్‌లోని గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. గురువారం తెల్లవారుజాము నుంచి జోరుగా వాన కురవడంతో అధికారుల సూచనల మేరకు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మంగళవారం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వర్షం కారణంగా పట్టణంలోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మురుగు కాల్వల్లో వ్యర్థాలు తొలగించడంతో గతంలో లాగా బోసురోడ్డు, కొత్తపేట రహదారులు జలమయం కాలేదు. వర్షపు నీరు ఎప్పటికప్పుడు మురుగు కాల్వల ద్వారా డ్రెయిన్లకు చేరడంతో ఈ రహదారుల వెంట వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. తెనాలి డివిజన్‌లోని దుగ్గిరాలలో అత్యధిక వర్షపాతం 60.2 మి.మీ, చేబ్రోలులో 41 మి.మీ, కొల్లిపర 30.4 మి.మీ, పొన్నూరు 21.4 మి.మీ, తెనాలి 15.4 మి.మీ, కాకుమాను 14.6 మి.మీ, తాడేపల్లి 6 మి.మీ, మంగళగిరి 4 మి.మీ వర్షపాతం నమోదైంది.

● కొల్లిపర: మండలంలో గురువారం ఉదయం ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. మండల కేంద్రం కొల్లిపరలో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు సైతం నీటితో నిండిపోయాయి. మురుగునీరు రోడ్లపైకి చేరడంతో పాదచారులక, వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. అదేవిధంగా మున్నంగి, వల్లభాపురం, దావులూరు, పిడపర్తిపాలెం, చివలూరు, జెముడుబాడు, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. తూములూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో గృహాల చుట్టూ వర్షపు నీరు చేరుకోవడంతో గంటల తరబడి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.



కొల్లిపరలో జలమయమైన రహదారి, తూములూరులో సిమెంట్‌రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరుసగా ప్రతిరోజు కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు తెలిపారు. 1800 425 6468 నెంబరులో ప్రజలు వర్షాల కారణంగా కలిగే ఇబ్బందులను తెలియజేయాలని కోరారు. ఏ ప్రాంతంలోనైనా వర్షపు నీరు నిలబడినా, విద్యుత్ స్తంభాలు, తీగలు పడిపోయినా, పారిశుధ్య సమస్యలు ఉన్నా సమాచారం ఇవ్వాలని కోరారు.

● పొన్నూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం కురిసిన భారీ వర్షానికి పొన్నూరు పట్టణ, మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేకువ జాము నుంచి నిరంతరంగా వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురవడంతో పట్టణ, మండలంలోని ప్రధాన రహదారులు అంతర్గత రహదారుల్లో భారీగా వర్షపు నీరు చేరింది. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారులపై నిలిచిపోవడంతో రహదారులన్నీ కాలువలను తలపించాయి. వర్షపు నీటిలోనే వాహనదారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షానికి జీబీసీ రోడ్డు, పలు ప్రాంతాలలో ధ్వంసం అయింది. ధ్వంసం అయిన రహదారిలో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురయ్యారు. భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలలకు మధ్యాహ్నం వరకు నిర్వహించి భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సెలవు ప్రకటించారు. వర్షం కుండపోతగా కురుస్తుండటంతో ప్రజలు సాధారణ పనులను నిమిత్తం బయటకు వెళ్లేందుకు అవకాశం లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. భారీ వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. వాయిగుండం హెచ్చరికలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో సర్వత్రా ఆందోళన నెలకొంది. ప్రస్తుతం వరి పైరు ఈనిక దశలో ఉన్నందున ఈ దశలో పైరు దెబ్బతింటే పంట దిగుబడులపై పెను ప్రభావం చూపి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● చేబ్రోలు: చేబ్రోలు మండలంలో గురువారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. మండలంలోని పలు గ్రామాలు జలమయమయ్యాయి. శలపాడు గ్రామంలోని పురాతన రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోకి వర్షపు నీరు చేరింది. ఆలయ ప్రాంగణం అంతా నీటితో నిండిపోవడంతో పూజారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చేబ్రోలులో గురువారం కురిసిన భారీ వర్షం ప్రభావం స్పష్టంగా కనిపించింది. కొత్తపోలీస్ స్టేషన్ సమీపంలో రెడ్డిబావి రోడ్డు వద్ద ఉన్న ప్రధాన డ్రెయిన్ పొంగిపొర్లడంతో నీరు రోడ్లపైకి చేరి రహదారులు మునిగిపోయాయి. గుర్రపు డెక్కతో డ్రెయిన్ మూసుకుపోవడంతో నీటి ప్రవాహం రోడ్లపైకి చేరింది. తక్షణమే డ్రెయిన్‌లను శుభ్రపరచి, నీరు బయటకు వెళ్లే మార్గం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు మండల అధికారులను కోరుతున్నారు.



ప్రధాన డ్రెయిన్ పొంగి జలమయమైన రెడ్డిబావి రహదారి



చేబ్రోలు మండలం శలపాడు రామలింగేశ్వ ఆలయంలోకి చేరిన వర్షపు నీరు

రెవెన్యూ అంశాలు తహసీల్దార్‌కు తెలిసి ఉండాలి

● కలెక్టర్ అన్సారియా



కలెక్టరేట్‌లో తెనాలి రెవెన్యూ డివిజన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అన్సారియా, హాజరైన సబ్ కలెక్టర్ సంజనా సింహ

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి రెవెన్యూ అంశం తహసీల్దార్‌కు తెలిసి ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. తెనాలి రెవెన్యూ డివిజన్ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెవెన్యూ అంశాలపై ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్లు పూర్తి బాధ్యతాయుతంగా ఉంటూ, ప్రతీ అంశంపై పరిజ్ఞానం కలిగివుండాలని ఆదేశించారు. సానుకూల దృక్పథంతో పని చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో సమర్పించిన అర్జీలపై స్పష్టమైన విచారణ చేపట్టాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు నమ్మకంతో వస్తారని, వారి సమస్యకు సానుకూలంగా స్పందించి పూర్తి శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రజలు అర్జీలు సమర్పించేటప్పుడే అవసరమైన ధృవీకరణ పత్రాలు ఉన్నవి, లేనివి పరిశీలించి, అవసరమైతే వాటిని పొందుపరచాలని తెలియజేయాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికారాదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్దేశిత సమయంలో సమస్యలు పరిష్కారం కావాలన్నారు. మ్యుటేషన్‌లో ఎటువంటి ఫిర్యాదులు ఉండరాదన్నారు. ఫారం-8లో నోటీసులు జారీచేసి, పక్కాగా విచారణ చేయాలని ఆదేశించారు. గ్రామ సభల నిర్వహణ సమాచారం కూడా పక్కాగా ముందస్తుగా ఇవ్వాలన్నారు. వీఆర్‌వోలు, సర్వేయర్లు గ్రామ సభల నిర్వహణలో సక్రమంగా చేపట్టే విధంగా పర్యవేక్షణ జరగాలన్నారు. ఐవీఆర్ఎస్‌లో మ్యుటేషన్‌లపై ప్రజల స్పందన సైతం ప్రభుత్వం కోరడం జరుగుతోందన్నారు. ప్రతికూల స్పందన ప్రజల నుంచి రాకూడదని స్పష్టం చేశారు. అనవసరంగా దస్త్రాలు పదేపదే దీర్ఘకాలం నడవరాదన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, సబ్ కలెక్టర్ సంజనసిన్హా, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాలలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

● మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు



శిక్షణ పొందిన పారిశుధ్య కార్మికులతో అధికారులు

పొన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు పని ప్రదేశాలలో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు సూచించారు. పొన్నూరు పట్టణంలోని పురపాలక సంఘంలో గురువారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యకరమంలో భాగంగా పురపాలక సంఘం పరిధిలోని పారిశుధ్య కార్మికులకు వాష్ ఇనిస్టిట్యూట్, సాహస సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ చేసేటప్పుడు, పని ప్రదేశాల్లో కార్మికులు అనారోగ్యానికి గురైతే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో వాష్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు అర్జున్ ప్రసాద్, మధుసూదన్, విజయసారధి, శంకర్ రామారావు, తదితరులతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎన్విరాన్మెంటల్ ఇన్చార్జి ఏఈ వి సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం నిత్య పద్య కుసుమం గ్రంథావిష్కరణ

తెనాలి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ సత్సంగం కేంద్రంలో గురువారం కార్తీకమాసం నిత్యపద్య కుసుమం గ్రంథావిష్కరణ చేశారు. టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు మాట్లాడుతూ, సాహిత్య రచనలు మనసుకు స్వాంతన చేకూరుస్తాయని, సాహిత్య అభిమానులకు ఊరట కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా రచయిత అయినాల మల్లేశ్వరరావును అభినందించారు. కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, వెంపటి సత్యనారాయణ, మొవ్వా సత్యనారాయణ, కొలసాని రాంచంద్, ఆలపాటి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్తీకమాసం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రఘునాథ బాబు తదితరులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

నాగేంద్రస్వామి పుట్ట అభివృద్ధికి సహకరిస్తా

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కట్టెంపూడి నాగేంద్రస్వామి పుట్ట దేవస్థానం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని కట్టెంపూడి శ్రీనాగేంద్రస్వామి పుట్ట దేవస్థానం నూతన పాలక మండలి అభినందన సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు ఆలయ అర్చకులు అధికారులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు, ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో వసతుల గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ నాగేంద్రస్వామి పుట్ట దేవస్థానం న్యాయపరమైన చిక్కులు తొలగించేందుకు పాలకవర్గం పనిచేయాలని ఆదేశించారు. అలాగే భక్తులకు అవసరమైన అన్నిరకాల వసతులు కల్పించేలా పాలకవర్గం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి అందజేస్తే తమవంతు సహకారం అందిస్తామన్నారు. నాగేంద్రస్వామి దేవస్థానంలో పొంగళ్లు వండుకోవడానికి అవసరమైన వంట గది నిర్మాణం, కల్యాణ మండప ప్రాంగణాలను పరిశీలించారు. నూతన పాలకమండలి రెండు రోజుల్లో జరిగే నాగుల చవితి వేడుకలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ ఎక్కటి పద్మారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఆలయ అధికారులు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగించుకోవాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్‌లను మండల గ్రామాల ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరు, దావులూరు, కొల్లిపర సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్‌కార్డు బయోమెట్రిక్ అప్డేషన్ చేయడం కోసం మండల గ్రామాల్లోని సచివాలయాలో ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఆధార్‌లో ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే సంబంధించిన ఆధారాలను తీసుకువచ్చి సరిచేయించుకోవాలన్నారు. చిన్న పిల్లలను కూడా తీసుకువచ్చి ఆధార్‌ను నమోదు చేసుకోవచ్చునన్నారు.



దావులూరులో ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



పిడుగుపాటుతో మృతిచెందిన మహిళకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పొన్నూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు మృతిచెందిన మహిళా కూలీల కుటుంబ సభ్యులను గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణంలోని 23వ వార్డులో వలపర్ల కమలమ్మ, 27వ వార్డులో షేక్ ముజాహిద మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఒక్కొక్క మృతుల కుటుంబాలకు రూ.10వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26 నుంచి కొల్లిపరలో కొలుపులు

కొల్లిపర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మత సమైక్యతకు కొల్లిపరలో నిర్వహించే కొలుపులు ప్రతీకగా నిలుస్తాయి. గ్రామదేవతలైన శ్రీగంగానమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, మద్దిరావమ్మలకు ఇచ్చిన ప్రాముఖ్యతను మదార్ సాహెబ్‌కు ఇచ్చి కొలుపుల్లో పాల్గొనేలా పెద్దలు వ్యవహరించి మత సమైక్యతను చాటుతున్నారు. హిందువు, ముస్లింలు కలిసి ఘనంగా కొలుపులు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తున్నారు. హిందువులు, ముస్లింలు సమిష్టిగా కొలుపుల్లో పాల్గొనే సంప్రదాయం అనాదిగా వస్తోంది. గత కొన్ని శతాబ్దాలుగా గంగానమ్మ కొలుపులను రెండేళ్లకొకసారి నిర్వహిస్తున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి నవంబరు 9వ తేదీ వరకు నిర్వహించాలని పెద్దలు తీర్మానించారు.